



బాపట్ల.. చారిత్రక ప్రసిద్ధి

బాపట్ల.. చారిత్రక ప్రసిద్ధి చెందింది. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి రాజకీయ చైతన్యం బాపట్ల సొంతం. ప్రథమాంధ్ర మహాసభలకు బీజం పడింది ఇక్కడే. చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా అంటూ ఉద్రూతలూగించిన గేయ రచయిత వేములపల్లి శ్రీకృష్ణకు బాపట్ల ఓటర్లు పట్టం కట్టి అసెంబ్లీలో తమ వాణిని వినిపించారు. ఇక్కడి నుంచి కోన ప్రభాకరరావు గెలిచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా, స్పీకర్‌గా సేవలందించారు. అంతేగాక గవర్నర్ పదవిని కూడా అందుకున్నారు. తండ్రి బాటలో ఆయన తనయుడు కోన రఘుపతి బాపట్లలో గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టి ఏపీ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రశాంతతకు నెలవుగా.. ఆధ్యాత్మకశోభకు నిలయంగా.. విద్యల ఖాణాచిగా.. వ్యవసాయంలో ఎన్నో నూతన ఆవిష్కరణలకు వేదికగా.. తీర ప్రాంత భద్రతలో తలమానికంగా నిలిచిన ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ కొలువైన బాపట్ల జిల్లా కేంద్రంగా ఏర్పడ్డాక తొలిసారి అసెంబ్లీ నియోజక వర్గానికి త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. దీంతో జిల్లా కేంద్రంలో పట్టు నిలుపుకునేందుకు ప్రధాన పార్టీలన్నీ సర్వశక్తులు ఒడ్డుతూ గెలుపుకోసం ప్రయత్నిస్తున్నాయి.

- రాజకీయ చైతన్యం భావపురి సొంతం
- ప్రథమాంధ్ర మహాసభలకు బీజం ఇక్కడే
- నియోజకవర్గంలో ఇప్పటికి 15 సార్లు ఎన్నికలు
- స్వాతంత్ర్య సమరయోధుడిగా ఖ్యాతికెక్కిన మంతెన

బాపట్ల నియోజకవర్గంలో..

మొత్తం ఓట్లు :	1,89,514
పురుషులు :	92,089
మహిళలు :	97417
ఇతరులు :	8

సం.	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	వేములపల్లి శ్రీకృష్ణ	సీపీఐ	ఎన్.వెంకట్రాజు	కాంగ్రెస్	2379
1955	ఎం.వెంకటరాజు	కాంగ్రెస్	వి.శ్రీకృష్ణ	సీపీఐ	7969
1962	కె.కోటేశ్వరరావు	స్వతంత్ర	ఎం.సత్యవతి	కాంగ్రెస్	1210
1967	కోన ప్రభాకర్‌రావు	కాంగ్రెస్	కె.వెంకటేశ్వరరావు	సీపీఎం	15,227
1972	కోన ప్రభాకర్‌రావు	కాంగ్రెస్	ముప్పలనేని శేషగిరిరావు	స్వతంత్ర	2289
1978	కోనప్రభాకర్‌రావు	కాంగ్రెస్	ముప్పలనేని శేషగిరిరావు	జనతా	189
1983	సి.విజయరామరాజు	టీడీపీ	కోన ప్రభాకర్‌రావు	కాంగ్రెస్	29,432
1985	ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు	టీడీపీ	ఎం.వి.ఎస్.రాజు	స్వతంత్ర	18,027
1989	చీరాల గోవర్దన్‌రెడ్డి	కాంగ్రెస్	పి.అచ్చుతరామరాజు	టీడీపీ	15,583
1994	ముప్పలనేని శేషగిరిరావు	టీడీపీ	కత్తిపద్మారావు	బీఎస్‌పీ	41,494
1999	మంతెనఅనంతవర్మ	టీడీపీ	ముప్పలనేని శేషగిరిరావు	కాంగ్రెస్	13,845
2004	గాదె వెంకటరెడ్డి	కాంగ్రెస్	మంతెన అనంతవర్మ	టీడీపీ	15,569
2009	గాదె వెంకటరెడ్డి	కాంగ్రెస్	చీరాల గోవర్దన్‌రెడ్డి	టీడీపీ	1363
2014	కోన రఘుపతి	వైసీపీ	అన్నం సతీష్‌ప్రభాకర్	టీడీపీ	5813
2019	కోన రఘుపతి	వైసీపీ	అన్నం సతీష్ ప్రభాకర్	టీడీపీ	15,192

బాపట్ల నియోజకవర్గంలో సామాజిక వర్గాల వారీగా ఓటర్ల అంచనా

రెడ్డి	43,000
ఎస్సీ(మాదిగ)	4,000
ఎస్సీ(మాల)	38,000
ముస్లి	13,800
కాపు	15,000
కమ్మ	8,000
యాదవ	19,000
గౌడ	9,000
రజక	4,000
వైశ్య	5,000
ఎస్టీ	10,000
మత్స్యకార	5,000
బ్రాహ్మణ	3,500
క్షత్రియులు	4,000
ఇతరులు	8,214

నియోజకవర్గ ముఖచిత్రం



బాపట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆటుపోట్లతో నిండిన సముద్ర తీర ప్రాంత నియోజకవర్గమైన బాపట్ల ప్రజలు ప్రశాంతత మారుపేరుగా నిలిచారు. వివాదాలకు దూరంగా సామరస్యంగా మెలిగే ప్రజలు రాజకీయ చైతన్యం కలిగి ఉంటారు. బాపట్లకు ఎంతో చారిత్రక ప్రసిద్ధి ఉంది. స్వాతంత్ర్య ఉద్యోమంలో ఎన్నో పోరాటలకు బాపట్ల వేదికగా నిలిచింది. రాజకీయంగా కూడా ఎంతో చైతన్యం కలిగిన ప్రాంతంగా బాపట్ల ప్రసిద్ధి చెందింది. స్వాతంత్ర్య సమరయోధుడిగా ఖ్యాతికెక్కిన మంతెన వెంకటరాజు 1955లో కాంగ్రెస్ తరఫున అసెంబ్లీలో అడుగుపెట్టారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పుట్టింది ఇక్కడే.

నియోజకవర్గ ప్రస్థానం.. చరిత్ర

1794లోనే బాపట్ల తాలూకాగా ఏర్పడింది. జిల్లా ఏర్పాటు వరకు బాపట్ల తెనాలి రెవెన్యూ డివిజన్‌లో ఉండేది. 2022లో జిల్లాగా ఏర్పడ్డాక రెవెన్యూ డివిజన్‌గా అవతరించింది. బాపట్ల నియోజకవర్గ పరిధిలో బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలు ఉన్నాయి. బాపట్ల మండల పరిధిలో 28 గ్రామాలు ఉండగా, కర్లపాలెం పరిధిలో 20, పిట్టలవానిపాలెం మండల పరిధిలో 14 గ్రామాలు ఉన్నాయి. ఇక బాపట్ల ఎన్నో చారిత్రక పోరాటాలకు, ఉద్యమాలకు వేదికగా నిలిచింది. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన ఉద్యమాలలో హరిజనులకు దేవాలయ ప్రవేశం, మంచినీటి బావుల ఏర్పాటు, వితంతు వివాహాలు బాపట్ల నుంచి మంతెన వెంకటరాజు శ్రీకారం చుట్టారు. దీంతో బాపట్ల పేరు బ్రిటీష్ వారి హయాంలోనే జాతీయ స్థాయిలో మారుమోగింది. ప్రథమాంధ్ర మహాసభలకు బీజం పడింది కూడా ఇక్కడే. 1913 మేలో నిర్వహించిన ఈ సమావేశాలకు బాపట్ల టౌన్‌హాలు వేదికగా నిలిచింది. 1916లో హోంరూల్ ఉద్యమంపై బ్రిటీష్ దమన నీతిని వ్యతిరేకిస్తూ భారీ సభ నిర్వహించారు.

వరి, ఆక్వాతో పాటు మత్స్యకారులు..

వ్యవసాయంగా ఈ ప్రాంతం ఎక్కువగా వరి పంటపైనే ఆధారపడి ఉంది. బాపట్ల మండల పరిధిలో ఎక్కువగా వరి సాగు చేస్తుండగా, కర్లపాలెం మండల పరిధిలో ఆక్వా సాగు ఎక్కువగా జరుగుతుంది. సముద్ర తీర ప్రాంతం ఎక్కువగా ఉండడంతో చేపల వేటపై ఆధారపడి బతుకీడ్చే మత్స్యకారుల సంఖ్య గణనీయంగానే ఉంది. ఆక్వారంగానికి సంబంధించి హేచరీలు, ప్రాసెసింగ్ యూనిట్లు ఎక్కువగా ఉండడంతో వేల మందికి ఉపాధి కల్పిస్తున్న రంగంగా ఆక్వా ఉంటోంది. ఏటా వేలకోట్ల టర్నోవర్ ఆక్వా రంగం మీదే ఆధారపడి జరుగుతుంటోంది.

తుఫాన్ల బెడద..

సుదూర సముద్ర తీర ప్రాంతం బాపట్ల పరిధిలో ఉండడంతో ఈ ప్రాంతానికి తుఫాన్ల బెడద ఎక్కువే. ఇప్పటి వరకు ఐదు భారీ తుఫాన్లు బాపట్ల పరిసరాల్లో తీరం దాటినట్లు సమాచారం. తాజాగా మిచౌంగ్ తుఫాన్ బాపట్ల సమీపంలోనే తీరం దాటింది. అందుకే తుఫాన్ సంకేతాలు కనబడిన ప్రతిసారి ఈ ప్రాంత పరిధిలోని రైతులు వణికిపోతుంటారు.

పర్యాటకంగా.. ఆధ్యాత్మికంగా..

బాపట్ల సూర్యలంక సముద్ర తీరానికి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. కార్తీకమాసంలో అయితే లక్షల్లో భక్తులు సముద్ర స్నానానికి పోటెత్తుతారు. దీంతో ఆటవిడుపు కేంద్రంగా బాపట్ల ప్రసిద్ధికెక్కింది. తీరంలో ఉన్న సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్ తీరం అందాలకు మరింత వన్నెలద్దినట్లు ఉంటుంది. వార సత్వ సంపదగా బాపట్ల బావన్నారాయణస్వామి ఆలయం భాసిల్లుతోం ది. భక్తులకు కొంగుబంగారంగా జిల్లెల్లమూడి అమ్మ ఉంది. బాపట్ల పట్టణంలోని సీబీజెడ్ చర్చికి ఘన చరిత్ర ఉంది. వందల ఏళ్ల పైబడి క్రైస్తవులకు ఆరాధన స్థలంగా ఖ్యాతికెక్కింది. దక్షిణ భారతదేశంలోనే ప్రప్రథమంగా స్థాపించిన వేద పాఠశాలగా శ్రీశంకర విద్యాలయం విరాజిల్లుతోంది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తొలిగా పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రా మంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేసిన తర్వాతే నామినేషన్ వేయడం ఆనవాయితీగా వస్తోంది. చందోలు పరిధిలో ఉన్న శ్రీభగళాముఖి అమ్మవారి దేవస్థానానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భక్తులు తరలివస్తుంటారు. బాపట్ల నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రతి గ్రామంలో గ్రామదేవతల పేరిట తిరునాళ్లు జరగడం ఇక్కడ ప్రత్యేకత.

తొలి వ్యవసాయ కళాశాల..

బాపట్లలో దశాబ్దాల తరబడి సేవలందిస్తున్న వ్యవసాయ కళాశాల 1945లో మొదలైంది. అప్పట్లో ఇది దక్షిణ భారతదేశంలోనే ఏర్పడిన తొలి వ్యవసాయ కళాశాల కావడం గమనార్హం. ఎంతో మంది మట్టిలో మాణిక్యాలను అందించి ప్రపంచ చిత్రపటంలో బాపట్లను నిలపడంలో ఏజీ కళాశాల తనదైన ముద్రవేసుకుంది. బీపీటీ - 5204 సహా ఎన్నో మేలు రకాల వంగడాలను దేశానికి అందించిన ఘనత ఈ గడ్డ సొంతం. జీడిమామిడి పరిశోధన కేంద్రంతో పాటు ఉప్పునీటి పరిశోధనాకేంద్రం కూడా బాపట్లలో ఉన్నాయి. బాపట్ల ఎద్యుకేషనల్ సొసైటీ కూడా పేరెన్నిక గల సంస్థగా వెలుగొందుతోంది.

పెద్దల సభకు ఐదుగురు..

శాసనమండలికి బాపట్ల నుంచి ఐదుగురు ప్రాతినిధ్యం వహించారు. 1983 దశకంలో ఎమ్మెల్సీలుగా ముప్పలనేని శేషగిరిరావు, ఆచంట రంగనాయకులు ఎన్నికయ్యారు. మూడు దశబ్దాల తర్వాత అన్నం సతీష్‌ప్రభాకర్, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పెద్దల సభలో అడుగుపెట్టారు. శాసన మండలి చీఫ్‌విప్‌గా ప్రస్తుతం ఉమ్మారెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇదే ప్రాంతానికి చెందిన కుంభా రవిబాబు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా గడచిన సంవత్సరం ఆగస్టులో ఎన్నికయ్యారు

- 1952 నుంచి ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరగ్గా ఏడు సార్లు కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టగా, నాలుగుసార్లు టీడీపీకి, సీపీఐ, స్వతంత్రులు ఒకసారి, చివరి రెండుసార్లు వైసీపీ విజయం సాధించాయి.
- బాపట్ల ఓటర్ల తీర్పు ప్రతిసారీ ప్రత్యేకమే. 1967నుంచి బాపట్లలో ఏ పార్టీ గెలుస్తుందో ఆ పార్టీ అధికారంలోకి వస్తుందనే సెంటిమెంట్ నడిచింది. అయితే అది 2009 వరకు మాత్రమే కొనసాగింది. 2014లో బాపట్లలో వైసీపీ అభ్యర్థి కోన రఘుపతి ఎమ్మెల్యేగా విజయం సాధించగా టీడీపీ అధికారంలోకి వచ్చింది.
- చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా అంటూ ఉద్రూతలూగించిన గేయ రచయత వేములపల్లి శ్రీకృష్ణ 1952లో తొలిసారి సీపీఐ తరపున బాపట్ల ఓటర్లు పట్టం కట్టారు.
- 1967, 72, 78లలో హ్యాట్రిక్ విజయాన్ని కాంగ్రెస్ తరపున కోన ప్రభాకరరావు నమోదు చేశారు. ఈయన మంత్రిగా, స్పీకర్‌గా, గవర్నర్‌గా సేవలందించారు. 1983 ఎన్నికల్లో టీడీపీ తరపున సీ విజయరామరాజు విజయం సాధించి కోన ప్రభాకరరావు విజయ పరంపరకు బ్రేక్ వేశారు. 2014, 2019లో వైసీపీ తరపున ప్రభాకరరావు తనయుడు కోన రఘుపతి గెలుపొందారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా కోన రఘుపతి పనిచేశారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో వైసీపీ తరపున కోనకే అభ్యర్థిత్వం ఖరారవగా హ్యాట్రిక్ విజయంపై కన్నేశారు.
- 2004, 2009లో కాంగ్రెస్ తరపున విజయం సాధించిన గాదె వెంకటరెడ్డి వైఎస్ రాజశేఖరరెడ్డి క్యాబినెట్‌లో మంత్రిగా సేవలందించారు.



వేములపల్లి శ్రీకృష్ణ | ఎం. వెంకటరాజు | కొమ్మినేని వెంకటేశ్వరరావు | కోన ప్రభాకరరావు | సి. విజయరామరాజు | ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు | చీరాల గోవర్ధనరెడ్డి | ముప్పలనేని శేషగిరిరావు | మంతెన అనంతవర్మ | గాదె వెంకటరెడ్డి | కోన రఘుపతి (ప్రస్తుత ఎమ్మెల్యే, వైసీపీ తరపున బరిలో వున్న అభ్యర్థి) | వేగేశన నరేంద్ర వర్మ (టీడీపీ తరపున బరిలో ఉన్న అభ్యర్థి)

రాజీనామా చేయాల్సిందే

- వలంటీర్లపై వైసీపీ నేతల ఒత్తిడి
- రెండు నెలల జీతం ఎవరిస్తారని ప్రశ్నలు



రాజీనామా లేఖ చూపుతున్న వలంటీర్లు

నరసరావుపేట, మార్చి 28: ఎన్నికల ప్రక్రియలో తమకు అనుకూలంగా పని చేసేందుకు రాజీనామా చేయాల్సిందేనని వలంటీర్లపై నరసరావుపేట వైసీపీ నేతల నుంచి ఒత్తిళ్ల పెరిగాయి. కొందరు నేతలు ఇళ్లకు పిలిపించుకుని మరీ బెదిరిస్తున్నట్లు వలంటీర్లు చెప్పకనే చెబుతున్నారు. వచ్చేది వైసీపీ ప్రభుత్వమే మళ్లీ ఎవరి ఉద్యోగం వారికి ఇస్తాం.. రాజీనామా చేసి డాక్టర్ గోపిరెడ్డి విజయం కోసం పనిచేయాలని వలంటీర్లకు నేతలు సూచిస్తున్నట్లు తెలిసింది. కోడ్ ఉల్లంఘించే వలంటీర్లపై అధికారులు చర్యలు తీసుకుంటుండటంతో అధికార పార్టీ ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలోనే వారి చేత రాజీనామాలు చేయించి, వారి ద్వారా ఎన్నికల పక్రియను నిర్వహించుకోవాలని వైసీపీ నేతలు సమాయత్తమవుతున్నారు. ఈ క్రమంలో వారిపై ఒత్తిడి పెంచి రాజీనామా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే రెండు నెలలుగా జీతాలు చెల్లించలేదని, మార్చితో కలిపి మూడు నెలలకు ఏప్రిల్‌లో జీతాలు వస్తే అప్పుడు రాజీనామా అంశాన్ని ఆలోచిస్తామని కొందరు వలంటీర్లు చెప్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటే ప్రభుత్వం ఇచ్చే జీతం పార్టీనే చెల్లిస్తుందని నేతలు మభ్యపెడుతున్నట్లు విమర్శలున్నాయి. జీతాలపై వైసీపీ నేతల నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో రాజీనామాల విషయంలో కొందరు వలంటీర్లు వెనక్కు తగ్గుతున్నట్లు తెలిసింది. నేతల ఒత్తిళ్ల పెరుగుతుండటంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో కొందరు రాజీనామాలు చేస్తున్నట్లు సమాచారం. మిగిలిన వారు కూడా రెండు మూడు రోజుల్లో రాజీనామా చేయక తప్పని పరిస్థితులను నేతలు కల్పిస్తున్నారని కొందరు వలంటీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్ల మెడపై రాజీనామా కత్తి పెట్టి వైసీపీ నేతల బెదిరింపులను విపక్ష నేతలు ఖండిస్తున్నారు. వలంటీర్ల విషయంలో విపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలకు నరసరావుపేటలో రాజీనామాల ఎత్తుగడ నిదర్శనంగా ఉందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. జగన్మోహనరెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవడం, నరసరావుపేటలో డాక్టర్ గోపిరెడ్డి హ్యాట్రిక్ విజయం కోసం స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు 18వ వార్డు వలంటీర్ల పేరుతో సోషల్ మీడియాలో చేసిన పోస్టులు వైరల్ అవుతున్నాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.25(శుక్రవారం)
సహారీ (ఉదయం) 4.48 (శనివారం)

చెక్‌పోస్టుల వద్ద నిరంతర తనిఖీలు

నరసరావుపేట, మార్చి 28: ఎన్నికల నేపథ్యంలో సూర్యాపేట, నల్గొండ, పల్నాడు జిల్లాల అధికారులతో తెలంగాణలోని వాడపల్లిలో గురువారం అంతరాష్ట్ర సరిహద్దు జిల్లాల భద్రతా సమావేశం జరిగింది. సమావేశంలో పల్నాడు, సూర్యాపేట, నల్గొండ కలెక్టర్లు శివశంకర్, ఎస్.వెంకట్రావు, దాసరి హరిచందన, ఎస్పీలు బీజే రాహుల్‌హెగ్డే, చందనదీప్తి, మూడు జిల్లాల పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర సరిహద్దులోని చెక్ పోస్టుల వద్ద సిబ్బంది నిరంతరం వాహన తనిఖీలు చేయాలని ఆదేశించారు. అంతర్ జిల్లా, అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల గుండా నిబంధనలు అతిక్రమించి చట్ట వ్యతిరేకంగా నగదు, మద్యం, ఇతర వస్తువులు రవాణా జరగకుండా నిఘాకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పల్నాడు జిల్లా సరిహద్దులోని సూర్యాపేట, నల్గొండ జిల్లాలకు రాకపోకలు సాగించే రహదారుల వెంబడి పోలీసు శాఖకు సంబంధించి తొమ్మిది చెక్‌పోస్టులు, ఎక్సైజ్ శాఖకు సంబంధించి రెండు, అటవీ రవాణా శాఖకు సంబంధించి ఒక చెక్ పోస్టు ఏర్పాటు చేశామన్నారు.



సమావేశంలో కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

అధికారాలు.. కలేనా!

- పంచాయతీ కార్యదర్శులు సచివాలయాలకే పరిమితం
- జీవో వచ్చి నెల రోజులు దాటినా అమలులోకి రాని వైనం
- ఎన్నికల ప్రచారంలో వాడుకోవడానికేనా సాచివేత
- అస్తవ్యస్తంగా మారిన పంచాయతీల పనితీరు





గుంటూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వారు పేరుకే పంచాయతీ కార్యదర్శులు.. కానీ వారి విధులన్నీ సచివాలయాలకే పరిమితం. ఓ వైపు వందల సంఖ్యలో పంచాయతీలు ఖాళీగా వున్నా.. మరోవైపు అంతకు మించిన సంఖ్యలో పంచాయతీ కార్యదర్శులు కళ్లెదుటే వున్నా వారికి అధికారాలు మాత్రం దక్కలేదు. కార్యదర్శులు లేక పంచాయతీల పనితీరు పూర్తిగా దెబ్బతింటున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోలేదు. కార్యదర్శులకు అధికారాలు ఇస్తామని 2022లోనే ప్రభుత్వం జీవో నెం. 149 విడుదల చేసిన ప్రభుత్వం జీవోను బుట్టదాఖలు చేసింది. తాజాగా ఎన్నికల హడావుడి నేపథ్యంలో ఫిబ్రవరి 15న మరోమారు జీవో ఎంఎస్. నెం.11 పేరుతో మరో జీవో విడుదల చేసింది. ఈసారి కూడా అది అమలుకు నోచుకోలేదు. దీంతో పంచాయతీ వ్యవస్థ ఎప్పుడు గాడిన పడుతుందో ఎవరికీ తెలియని పరిస్థితి ఏర్పడింది.

నెలరోజుల క్రితమే జీవో..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 1230 గ్రామ సచివాలయాలు వున్నాయి. వాటిలో దాదాపు 700 మందికి పైగా గ్రేడ్ 1,2,3,4 పంచాయతీ కార్యదర్శులు వున్నారు. 2020లో సచివాలయ పరీక్షల ద్వారా మరో 568 మందిని రాష్ట్ర ప్రభుత్వం రిక్రూట్ చేసుకుంది. మొత్తంగా జిల్లావ్యాప్తంగా 1268 మందికి పైగా పంచాయతీ కార్యదర్శులున్నా గ్రామ పంచాయతీల పాలన మాత్రం గ్రేడ్ 1, 2, 3, 4 కార్యదర్శులు 700 మంది ఆధ్వర్యంలోనే సాగుతోంది. మిగిలిన పంచాయతీల్లో మాత్రం ఇన్‌చార్జి కార్యదర్శులదే అధికారం. సచివాలయ పరీక్షల ద్వారా నియమితులైన 568 మంది వున్నా ప్రభుత్వం వారికి పంచాయతీల విధులు కేటాయించలేదు. వారిని సచివాలయాలకే పరిమితం చేసి వారిని తమ ఇష్టారాజ్యంగా వాడుకుంది. అయినా ఫలితం మాత్రం దక్కలేదు.

ఒక పంచాయతీ.. ఒక కార్యదర్శి మాటేంటి?

జిల్లాలో వున్న 700 గ్రేడ్- 1,2,3,4 కార్యదర్శులకే పంచాయతీల బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం అందుకోసం రెండు, మూడు పంచాయతీలను కలిపి క్లస్టర్లుగా రూపొందించింది. దానికి సీనియర్ పంచాయతీ కార్యదర్శులనే ఇన్‌చార్జిగా నియమించింది. దాదాపు ఐదేళ్ల క్రితం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల నియామకం జరిగినా వారికి పంచాయతీలు కేటాయించలేదు. 'ఒక పంచాయతీ- ఒక కార్యదర్శి' అన్న నియమానికి మోక్షం మాత్రం దక్కలేదు. తాజాగా విడుదల చేసిన జీవోఎంఎస్ నెం. 11 ప్రకారం గ్రామ జనాభా 500 దాటిన ప్రతి పంచాయతీకి ఒక పంచాయతీ కార్యదర్శిని నియమించాలని, దాని కోసం అదనంగా మరికొన్ని గ్రామ పంచాయతీలకు డీడీవో కోడ్‌ను కొత్తగా రూపొందించాల్సి వుంది. అప్పుడు మాత్రమే పంచాయతీల పాలన గాడిన పడుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల సంఖ్యతో సమానంగా కార్యదర్శులు వున్నా అది ఆచరణకు నోచుకోలేదు. ఉద్యోగుల ఆందోళన చేసినప్పుడల్లా తూతూ మంత్రపు చర్యలు తీసుకోవడమే తప్ప ఫలితం లేదు. 'ఒక పంచాయతీ ఒక కార్యదర్శి' దస్త్రాలపై కిందటేడాది సెప్టెంబరులోనే ముఖ్యమంత్రి సంతకం చేసినప్పటికీ ఈరోజు వరకూ అది ఆచరణకు నోచుకోలేదు. జీవోనే పెద్ద బూటకమని అర్థమై వారు ఆందోళన చేపట్టారు. ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో వారిని ప్రసన్నం చేసుకోవడానికి ప్రభుత్వం సరిగ్గా ఎన్నికలకు నెలరోజుల ముందు జీవో జారీ చేసింది. కానీ ఆచరణకు మాత్రం నోచుకోలేదు.

ఆది నుంచి గందరగోళమే..

సచివాలయ వ్యవస్థ అమలులోకి తెచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తంగా తయారయిందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శులను వారి శాఖకు సంబంధించిన విధులకు పరిమితం చేయకుండా సంబంధం లేని అనేక విధులకు కేటాయిస్తున్నారు. అందులోభాగంగా దాదాపు 91 మందికి బీఎల్‌వో విధులు కేటాయించారు. ఇప్పుడు ఆ విధులకు అటంకం ఏర్పడుతుందన్న కారణంగా అప్పాయింటింగ్ అథారిటీగా గుంటూరు జిల్లా కలెక్టర్ జీవోను అమలు చేయకుండా ఆపారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఉద్యోగులకు అధికారాల కల నెరవేరలేదు. పంచాయతీలకు పట్టిన గ్రహణం వీడలేదు. పంచాయతీ కార్యదర్శులకు ఉండే డీడీవో పవర్ మాటేమోగానీ, కనీసం జనన, మరణ, వివాహ నమోదు, ధ్రువీకరణ పత్రాల జారీ, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల వంటి ప్రాథమిక విధులు కూడా వారికి దక్కలేదు. దీంతో చాలా పంచాయతీల్లో సాధారణ పరిపాలన దెబ్బతింటోంది. కాగా పంచాయతీ కార్యదర్శులను అధికార పార్టీ వినియోగించుకోవాలనే కుట్రకోణం దీని వెనక దాగి వుందా అన్న అనుమానం పలువురు వ్యక్తంచేస్తున్నారు.

దిక్సూచి
DIKSUCHI

అండర్ గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్

ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ)- అండర్ గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(యూజీఏటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిద్వారా పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ, బీబీఏ, బీహెచ్‌ఎం, బీసీఏ, బీకాం(ఈ-కామర్స్), బీఎస్సీ(ఐటీ), బీబీఏటీ, బీఐటీఎం ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు/ ప్రస్తుతం పరీక్షలు రాసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

యూజీఏటీ వివరాలు: దీనిని పీబీటీ(పేపర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 40, న్యూమరికల్ అండ్ డేటా అనాలిసిస్ నుంచి 30, రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్ నుంచి 30, జనరల్ నాలెడ్జ్ నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు. బీహెచ్‌ఎం కోర్సుకు నిర్వహించే ఎగ్జామ్‌లో మాత్రం పైవాటితోపాటు సర్వీస్ ఆప్టిట్యూడ్ నుంచి 25, సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు. వీటికి అదనంగా గంట సమయం ఇస్తారు. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు ఉంటుంది. రుణాత్మక మార్కులు ఉన్నాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు:** రూ.750
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** జూన్ 9న
- **యూజీఏటీ 2024 తేదీ:** జూన్ 16
- **వెబ్‌సైట్:** aima.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/vmwGcshలో చదవండి.

SCHOLARSHIP ALERT



Directorate General of Trade Remedies (DGTR) Internship Program 2024

Description: Directorate General of Trade Remedies (DGTR) Internship Program 2024 is an opportunity offered by the Ministry of Commerce and Industry, Government of India to postgraduate students/research scholars. The objective of this program is to equip interested and motivated students with the knowledge and skills necessary to understand and engage in Trade Remedies Investigations and Trade Defence Measures.
Eligibility: Open for postgraduate students/research scholars from recognised universities/institutions.
Prizes & Rewards: A certificate of completion
Last Date to Apply: Round The Year
Application mode: via email or post: to the General Administration Section of DGTR
Short Url: www.b4s.in/aj/DGCI1

The Sonny and Gita Mehta Scholarship for Writers

Description: The Sonny and Gita Mehta Scholarship for Writers 2024 is an opportunity offered by the University of East Anglia (UEA) to support aspiring writers from the Indian subcontinent, the Middle East or North Africa to enable them to undertake study in the Department of Literature, Drama and Creative Writing at UEA.
Eligibility: Open for Indian writers who are native of India and demonstrate outstanding creative writing potential.
Prizes & Rewards: A tuition fee of £28,500 and maintenance fees ***Last Date:*** 01-05-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SOIS6

ICRO Amrit Internship Programme 2024

Description: ICRO Amrit Internship Programme 2024 is a joint initiative of the Indian Potash Limited (IPL) and the National Productivity Council (NPC) under the Ministry of Commerce and Industry, Government of India for Class 12 passed, final-year graduation students, graduates, and diploma holders.
Eligibility: Open for Indian nationals aged between 18-45 years. Applicants must be Class 12 passed, final-year graduation students, graduates, or diploma holders with a a valid Aadhaar card.
Prizes & Rewards: A monthly stipend of 6,000 and a certificate of completion
Last Date: 01-10-2024 ***Application:*** Online Only
Short Url: www.b4s.in/aj/ICRA1

buddy4study.com



బాలకృష్ణ నట విశ్వరూపాన్ని ప్రదర్శించిన చిత్రం 'లెజెండ్'. 2014 మార్చి 28న విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ఇండస్ట్రీ రికార్డులను తిరగరాసింది. పలు అవార్డులు రివార్డులు కొల్లగొట్టింది. ఇప్పుడు మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నెల 30న 'లెజెండ్'ను ప్రపంచవ్యాప్తంగా రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం 'లెజెండ్ బ్లాక్‌బస్టర్ టెన్ ఇయర్స్ సెలబ్రేషన్స్'ను చిత్రబృందం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బాలకృష్ణతో పాటు దర్శకుడు బోయపాటి శ్రీను, రామ్‌ఆచంట, గోపీ ఆచంట, కథానాయిక సోనాల్ చౌహాన్, నటీనటులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.



ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకొన్న అల్లు అర్జున్ తాజాగా మరో ఘనతను సాధించారు. దుబాయ్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ఆయన మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గురువారం జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో అల్లు అర్జున్ పాల్గొన్నారు. 'ఎంతో ఉద్విగ్నంగా ఉంది, ఇదొక గొప్ప గౌరవం' అని బన్నీ పేర్కొన్నారు.

మరింత ఎనర్జిటిక్‌గా ఉంటుంది



తెలుగు ప్రేక్షకులు ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ సీక్వెల్స్‌లో 'టిల్లు స్క్వేర్' ఒకటి. ఈ చిత్రం నేడు విడుదలవుతున్న సందర్భంగా హీరో సిద్ధు జొన్నలగడ్డ మీడియాతో ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

"డీజే టిల్లు విడుదల సమయంలో ప్రేక్షకుల్లో ఎలాంటి అంచనాలు లేవు. కానీ ఇప్పుడు సీక్వెల్‌పై అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి. కాబట్టే కొంచెం ఒత్తిడికి లోనయ్యాం. అయితే ఆ ఒత్తిడిని జయించి బెటర్ అవుట్‌పుట్ ఇచ్చాం. ఇందులో నా పాత్ర మొదటి భాగానికి కొనసాగింపుగా ఉంటుంది. కథ కూడా కొంత కొనసాగుతుంది. కానీ మొదటి భాగంతో పోలిస్తే రెండో భాగంలో నా పాత్ర మరింత ఎనర్జిటిక్‌గా ఉంటుంది. ఎందుకంటే ఈ సారి టిల్లు మరింత పెద్ద సమస్యలో ఇరుక్కుంటాడు. చాలా షాక్‌లు, సర్‌ప్రైజ్‌లు ఉంటాయి. సినిమా అంతా నవ్వుకుంటూనే ఉంటారు. టిల్లు పాత్ర నా ఆలోచనలు, నేను చూసిన అనుభవాల నుంచి పుట్టింది. టిల్లుకి, నాకు ఒక్కటే తేడా. టిల్లు తన మనసులో ఉన్నవన్నీ బయటకు అంటాడు. నేను మనసులో అనుకుంటాను అంతే తేడా. సీక్వెల్‌లో రాధిక పాత్ర ఉంటుందో లేదో థియేటర్లో చూసి మీరే తెలుసుకోండి. ఈ సినిమాకు భీమ్స్ సంగీతం ప్రత్యేకాకర్షణ. ప్రస్తుతానికి నా ఫోకస్ అంతా 'టిల్లు స్క్వేర్' విడుదలపైనే ఉంది. పార్ట్-3 కోసం కొన్ని ఐడియాస్ ఉన్నాయి" అని చెప్పారు.

పెళ్లి కాదు నిశ్చితార్థం?



హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితీరావ్ హైదరీ తమ పెళ్లి విషయంలో ట్విస్ట్ ఇచ్చారు. బుధవారం వనపర్తిలోని గుడిలో వీరిద్దరి పెళ్లి జరిగినట్లు వార్తలు వచ్చాయి. అయితే అక్కడ జరిగింది పెళ్లి కాదు నిశ్చితార్థం మాత్రమే అని అదితీ, సిద్ధార్థ్ సోషల్ మీడియా వేదికగా తెలిపారు. తమ నిశ్చితార్థపు ఉంగరాలను చూపుతూ ఇద్దరూ కలసి దిగిన ఫొటోను వారు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'ఆమె ఓకే చెప్పడంతో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాం' అని సిద్ధార్థ్ చెప్పారు. అయితే 'వీరిద్దరూ చెప్పినది నిజమేనా?' అనే సందేహాన్ని నెటిజన్లు వ్యక్తం చేస్తున్నారు. దీనికో కారణం ఉంది. అదితీరావ్ నటించిన 'హీరామండి: ద డైమండ్ బజార్' వెబ్‌సిరీస్ రిలీజ్‌డేట్ అనౌన్స్‌మెంట్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అదితి తప్ప నటీనటులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యాంకర్ సచిన్ కుంబర్ మాట్లాడుతూ 'ఈ రోజు అదితీరావ్ పెళ్లి చేసుకోబోతున్నారు. అందుకే ఆమె ఈ కార్యక్రమానికి రాలేదు' అని చెప్పడం గమనార్హం. పెళ్లి విషయంలో ఈ జంట ఇంత డొంకతిరుగుడుగా వ్యవహరించడం ఎందుకో అర్థం కావడంలేదంటున్నారు నెటిజన్లు.

21 ఏళ్ల తర్వాత మళ్లీ...



విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'ఫ్యామిలీ స్టార్' చిత్రం ట్రైలర్‌ను గురువారం ఉదయం హైదరాబాద్‌లోని శ్రీరాములు థియేటర్‌లో ప్రేక్షకుల మధ్య విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దర్శకుడు పరశురామ్ పెట్ల మాట్లాడుతూ 'ఈ సినిమాను, హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ మృణాల్ ఠాకూర్‌ను ప్రతి తెలుగు ప్రేక్షకుడు కొన్నేళ్ల పాటు గుర్తుంచుకుంటాడు. ఐ ఫీస్ట్ లాంటి సినిమా ఇది.' అని చెప్పారు. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ "గీత గోవిందం' చిత్రం తర్వాత విజయ్, పరశురామ్ కలసి వర్క్ చేసిన సినిమా ఇది. విజయ్ పాత్ర చాలా స్పెషల్‌గా ఉంటుంది. ఇరవై ఒక్క ఏళ్ల క్రితం ఏప్రిల్ 5న విడుదలైన 'దిల్' సినిమాతో నేను నిర్మాతగా మారి, దిల్‌రాజునయ్యా. మళ్లీ ఇప్పుడు అదే ఏప్రిల్ 5న 'ఫ్యామిలీ స్టార్' చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ఈ వేసవిలో మీకు వినోదాన్ని అందించే సినిమా ఇది. ఒక సూపర్ హిట్ చిత్రంతో మీ ముందుకు వస్తున్నాం' అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/SYCbBxz లో చదవండి.

అంబటి రాయుడు తండ్రికి సత్కారం



క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు తండ్రి సాంబశివరావును సత్కరిస్తున్న నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, మార్చి28: క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు తండ్రి సాంబశివరావును గురువారం మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సత్కరించారు. మండలంలోని వెల్లలూరు గ్రామంలో భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో గురువారం వీరిరువురు కలుసుకున్నారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ అంబటి సాంబశివరావు ఇరువురు ఒకరినొకరు సత్కరించుకొని యోగక్షేమాలను విచారించారు. కార్యక్రమంలో అంబటి సీతారామారావు, అంబటి శ్రీను, చౌడ వసంత్, అంబటి శ్రీనివాసరావు, గనిపిశెట్టి రామకృష్ణ, ఢిల్లీ బాబు, బుచ్చిబాబు,శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన షేక్ ఖాజా, తప్పించుకు పోయిన వ్యక్తి, స్వాధీనం చేసుకున్న దొంగనోట్లు

మద్యం షాపులో నకిలీ నోట్ల కలకలం

- ఆరా తీయాల్సిందిపోయి నిందితుడికి అనుకూలంగా పోలీసులు

యడ్లపాడు, మార్చి 28: మండల కేంద్రమైన యడ్లపాడులో నకిలీ నోట్లు కలకలం రేపింది. ప్రభుత్వ మద్యం షాపులోనే నకిలీ నోట్లను పట్టుకోవడం విశేషం. మండలంలోని కారుచోల గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకునికి స్వయానా సోదరుడైన షేక్ ఖాజా బుధవారం రాత్రి రూ.500 నకిలీ నోటు ఇచ్చి యడ్లపాడులోని వైన్ షాపులో మద్యం కొనుగోలు చేశాడు. కాగా గురువారం నగదును బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వెళ్ళిన వైన్ షాపు సిబ్బందికి బ్యాంకు సిబ్బంది ఒక నోటు నకిలీ నోటు అని చెప్పడంతో అవాక్కయ్యారు. గురువారం కూడా షేక్ ఖాజా మరో వ్యక్తితో కలసి నకిలీ నోట్లు తీసుకుని మద్యం కొనుగోలుకు వైన్ షాపుకు వచ్చాడు. ఈ క్రమంలో వైన్ షాపు సిబ్బంది ఖాజాను పట్టుకుని అతని వద్ద నుంచి ఏడు రూ.500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నోట్లపై ఒకే సీరియల్ నంబర్లు ముద్రించి ఉండడం విశేషం. స్వాధీనం చేసుకున్న నోట్లతోపాటు ఖాజాను వైన్‌షాపు సిబ్బంది పోలీసులకు అప్పగించారు. అంతేగాకుండా అతనితోపాటు మరో గుర్తు తెలియని వ్యక్తి కూడా వచ్చాడని, ఖాజాను నిర్బంధించడంతో అతను అక్కడి నుంచి తప్పించుకు పోయినట్లుగా వైన్ షాపు సిబ్బంది చెబుతున్నారు.

కాగా.. మద్యం షాపు సిబ్బంది దొంగ నోట్లు చలామణి చేస్తూ దొరికిన వ్యక్తిని పట్టుకుని అప్పగించినా పోలీసులు మాత్రం పట్టీ పట్టనట్లు వ్యవహరించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నకిలీ నోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి, దీని వెనుక ఎవరైనా ఉన్నారా అన్న విషయాన్ని విచారించాల్సిన పోలీసులు నిందితునికి అనుకూలంగా అతనికి వైన్‌షాపు వద్ద దొరికినట్లుగా చెబుతున్నారు. పైగా దొరికింది ఏడు నోట్లు కాగా నాలుగు నోట్లే అని తగ్గించి చెప్పడం మరింత అనుమానాలకు దారి తీస్తోంది.

జగనే పేదల పక్షపాతి కాదు.. కక్షపాతి



మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన నాదెండ్ల మనోహర్

- పేదలు... పెత్తందార్లని చెప్పి నట్టేట ముంచాడు
- ఉత్తుత్తి కార్పొరేషన్లతో ఖాళీ కుర్చీలిచ్చి బీసీలకు అన్యాయం
- టిడ్కో ఇళ్లన్నీ పాడుపెట్టి పేదలకు నీడలేకుండా చేశాడు

తెనాలి, మార్చి 28, (ఆంధ్రజ్యోతి): జగన్‌మోహనరెడ్డీ నువ్వసలు మనిషివేనా! నీకు మళ్లీ ఓటు అడిగే హక్కుందా? పేదలు... పెత్తందార్లంటావ్... పేదల పక్షపాతినంటావ్! నువ్వు పేదలపాలిట నరరూప భూతానివి. పక్షపాతి కాదు... కక్షపాతివి. రూ.కోట్ల విలువైన టిడ్కో ఇళ్లను ఏ కారణంతో పాడుపెట్టావ్? పేదలకు ఎందుకివ్వలేదు? వారిని అప్పులపాలు చేయటానికా? నీ కాలనీల పేరుతో భూదాహం తీర్చుకోటానికా? ఓపక్క గుక్కెడు నీరులేక జనం గొంతెండుతుంటే, రాష్ట్రాన్ని కల్తీ మద్యం, గంజాయి, డ్రగ్స్‌తో నింపేసిన ఘనుడివి నువ్వు... నిన్ను ఈసారి జనం జైలుకు పంపటానికే నిశ్చయించుకున్నారని, నీకు బైబై చెప్పేరోజు దగ్గరలోనే ఉందని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌లు తీవ్రస్థాయిలో విమర్శించారు. గురువారం తెనాలిలో ఇరువురు నాయకులు అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత తెనాలి టీబీ రోడ్డులో టీడీపీ పార్టీ కార్యాలయాన్ని ఇరువురూ ప్రారంభించారు. తర్వాత పాడుబెట్టిన టిడ్కో ఇళ్లను పరిశీలించారు. తర్వాత బీసీలు, తెనాలి ఫుడ్ అండ్ హోటల్ యజమానుల సంఘాలతో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల విలేకరుల సమావేశాల్లో మాట్లాడారు. ఎంతో ముందు చూపుతో చంద్రబాబు తీసుకొచ్చిన పట్టిసీమను పక్కనపెట్టి, కృష్ణా డెల్టాలో నీటికి కటకటలాడేలా చేశారని చంద్రశేఖర్ విమర్శించారు. కనీసం తాగటానికి గుక్కెడు నీరు దొరకని పరిస్థితి రాష్ట్రంలో ఉంటే, కల్తీ మద్యం, గంజాయి, డ్రగ్స్‌ను మాత్రం ఏరులుగా పారిస్తున్నారని మండిపడ్డారు. తన కూటమిలోని జగన్‌బాబా అరడజను దొంగలకు దోచిపెట్టేందుకు కల్తీ మద్యాన్ని దింపేసి, గంజాయితో యువకుల జీవితాలను చిత్తుచేసి, అవి చాలవన్నట్టు ఏకంగా డ్రగ్స్ మహమ్మారిని రాష్ట్రానికి అలవాటుచేసిన ఘన చరిత్ర జగన్‌కే దక్కుతుందన్నారు. అంతర్జాతీయ స్థాయి సామర్థ్యం ఉన్న కాంట్రాక్టర్‌లతో అత్యున్నత ప్రమాణాలతో చంద్రబాబు టిడ్కో ఇళ్ల నిర్మిస్తే, వాటిని పేదలకు ఇవ్వలేదన్నారు. 300 గజాల టిడ్కో ఇంటికి ఒక్క రూపాయికూడా తీసుకోకుండా చంద్రబాబు టిడ్కో ఇళ్ల నిర్మించి ఇస్తే, మీరు ఒక్క మంచం కూడా పట్టని 100 గజాల ఇంటికి రూ. 50వేల వరకు వసూలు చేశారని, అంత డబ్బు కట్టినా పేదలకు నేటికీ గూడు సమకూరలేదన్నారు. జగనన్న కాలనీల పేరుతో భూముల కొనుగోళ్లలో రూ.వందల కోట్లు వైసీపీ నేతలు దోచేస్తే, రోడ్లు, విద్యుత్తు సదుపాయాల పేరుతో అధిక రేట్లకు పరికరాలు కొనుగోలుచేసి రూ. వేల కోట్లు దోచుకున్నారని అన్నారు. ఈసారి జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేసి జగన్‌బాబా దొంగలను ఓడించి మీరు గెలవాలని కోరారు.

అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి మనోహర్ మాట్లాడుతూ జనం ఇబ్బందుల్లో ఉంటే, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే జగన్ ఒక్క రూపాయయినా తన కంపెనీల నుంచి కానీ, తాను సంపాదించిన డబ్బు నుంచి కానీ పేదలకు పంచాడా? అని ప్రశ్నించారు. ఎవరైన కష్టపడి సంపాదిస్తే వారికి డబ్బు విలువ తెలుస్తుందని, దోచుకున్న వారికి డబ్బుపైనే ప్రేమ ఉంటుంది కానీ, జనంపై ఉండదనేది ఇప్పటికైనా గుర్తించాలన్నారు. ఈ ఐదేళ్లలో తెనాలిలోనే కాకుండా రాష్ట్రం మొత్తంలో వ్యాపారులు, వర్తకులు ఎన్నో రకాలుగా అధికార పార్టీ దౌర్జన్యానికి బలయ్యారని, ఆస్థులు కబ్జాలకు, దోపిడీకి గురయ్యారని, ఇకపై అటువంటి పరిస్థితి ఉండదని మనోహర్ మాటిచ్చారు. మీ ఆస్తులు పదిలంగా ఉంటాయని, మీపై దాడులు జరగవని, ఒకవేళ ఎవరైన అటువంటి అక్రమాలకు పాల్పడితే తిప్పి కొడతామని స్పష్టం చేశారు. జ్యోతీరావు పూలే, అంబేద్కర్ ద్వారం పేర్లు తీసేసి వైఎస్ ద్వారాలని మార్చటం కుట్ర కోణమేనన్నారు. జగన్ పాలనలో సంక్షేమం బాగా జరిగిందనే అపోహలో కొందరు పేదలు ఉన్నారని, అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్‌ల నిధులు దారి మళ్లించేశారనేది గుర్తించాలన్నారు. ఆయన నొక్కిన బటన్‌లు కనిపిస్తున్నాయేకానీ, జనం ఖాతాల్లో డబ్బు మాత్రం కనిపించటంలేదని, ఇదేం మాయో అర్థం కావటంలేదన్నారు. సంక్షేమ పథకాలకు మేము వ్యతిరేకమని తప్పుడు ప్రచారానికి దిగుతున్నారని, జనసేన, టీడీపీ కలసి విడుదల చేసిన సూపర్ 6ను చూస్తే సంక్షేమానికి మేము ఎంతటి ప్రాధాన్యం ఇస్తున్నామో అర్థమవుతుందన్నారు. రేపటి ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల గెలుపుకోసం మీరంతా ముందుకు రావాలని మనోహర్ కోరారు.



మాట్లాడుతున్న బాపట్ల ఎంపీ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్, పక్కన అనగాని సత్యప్రసాద్

రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టింది జగనే

- బాపట్ల ఎంపీ అభ్యర్థి టి.కృష్ణ ప్రసాద్

రేపల్లె, మార్చి 28: ఐదేళ్ళ జగన్‌రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రం చీకటి అంధకారంలో నెట్టివేయబడిందని బాపట్లపార్లమెంటరీ టీడీపీ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలె టీడీపీ ప్రభుత్వం దళితులకు 27 పథకాలు అమలుచేసి వారికి అండగా నిలిచిందన్నారు. అనంతరం సీఎం జగన్‌రెడ్డి ఆ పథకాలను రద్దు చేశాడని అన్నారు. దళితులపై వివక్ష చూపుతూ వారిపై దాడులు చేయిస్తూ కపటప్రేమ నాటకాన్ని జగన్మోహన్‌రెడ్డి ఆడుతున్నారన్నారు. రాష్ట్రంలో యువత ఉద్యోగ అవకాశాలు లేక పక్క రాష్ట్రాలకు తరలి వెళ్ళిపోతున్నారని, అయినా ప్రభుత్వానికి సిగ్గుకూడా లేదన్నారు. ఐదేళ్ళలో ప్రజల ఆదాయం పెరగలేదు. ఆస్తులు పెరగలేదు, కానీ జగన్‌రెడ్డి ఆదాయం మాత్రం విపరీతంగా పెరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ళలో 9సార్లు విద్యుత్ చార్జీలు పెంచి పేదల నడ్డి విరిచారన్నారు. మద్యాన్ని నిషేదిస్తామనిచెప్పి ఓట్లు వేయించుకుని రూ.60 బాటిల్‌ను రూ.250లకు అమ్ముకుంటూ కోట్లాది రూపాయలు ధనాన్ని తాడేపల్లి ఖజానాను నింపుకుంటున్నారన్నారు. రక్తం పంచుకున్న పుట్టిన చెల్లి పుట్టుకను ప్రశ్నించారంటే తల్లిని అవమానించినట్లు కాదా మహిళా వ్యక్తిత్వాన్ని కించపరిచే ఇలాంటి దుర్మార్గున్ని ఏం చెయ్యాలో ప్రజలు ఆలోచించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లకు వచ్చిన నిధులన్నీ పక్కదారి పట్టించి వారిని అన్యాయం చేసిన ఘనత జగన్‌దేనన్నారు. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ఐదేళ్ళ జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రాన్ని 30సంవత్సరాలు వెనక్కి వెళ్ళిందన్నారు. మొన్నటి వరకు పరదాలు కట్టుకుని తిరిగే పరదాల వీరుడు జగన్‌రెడ్డి ఇప్పుడు రోడ్డెక్కుతూ ప్రజలను మరోసారి మాయమాటలు చెప్పి నమ్మించి మోసం చేసేందుకు మీముందుకు వస్తున్నాడని అన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పంతాని మురళీధరరావు, వైవీఎన్ ప్రసాద్, లుక్కా గుడారంకయ్య, కొలసాని రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రైళ్ల సర్వీసులు పొడిగింపు

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం గుంటూరు మీదగా రాకపోకలు సాగిస్తున్న ప్రత్యేక రైళ్ల సర్వీసులను జూన్ నెలాఖరు వరకు పొడిగించినట్లు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు. 08585 విశాఖపట్టణం - కర్నూలు టౌన్(ప్రతీ మంగళవారం) రైలుని ఏప్రిల్ 2 నుంచి జూన్ 25వ తేదీ వరకు, నెంబరు. 08586 కర్నూలుటౌన్ -విశాఖపట్టణం(ప్రతీ బుధవారం) రైలుని ఏప్రిల్ 3 నుంచి జూన్ 26 వరకు, నెంబరు. 08579 విశాఖపట్టణం - సికింద్రాబాద్ (ప్రతీ బుధవారం) రైలుని ఏప్రిల్ 3నుంచి జూన్ 26వ తేదీ వరకు, నెంబరు. 08580 సికింద్రాబాద్ - విశాఖపట్టణం(ప్రతీ గురువారం) రైలుని ఏప్రిల్ 4 నుంచి జూన్ 27వ తేదీ వరకు పొడిగించినట్లు డీఆర్‌ఎం తెలిపారు.

రూ.19.05 లక్షలు సీజ్

అమృతలూరు / కొల్లిపర, మార్చి 28: ఇద్దరి వ్యక్తులు తరలిస్తున్న నగదు రూ.19.05 లక్షలను సీజ్ చేశారు. అమృతలూరు మండలంలోని పెదపూడి వంతెన వద్ద బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ నగదు పట్టుబడింది. తెనాలి నుంచి బాపట్ల వైపుకు ఏలాంటి పత్రాలు లేకుండా తెస్తున్న ఇద్దరి వ్యక్తుల వద్ద నుంచి ఈ నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంను అధికారులు ఆర్‌వో వసంతరాయుడు దృష్టికి తీసుకువెళ్ళారు. ఆయన ఈ నగదును సీజ్ చేయమన్నట్లు సమాచారం.

గురువారం తెల్లవారు జామున కొల్లిపర మండల పరిధిలోని దావులూరు అడ్డరోడ్డు వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో తూములూరు గ్రామానికి చెందిన రావులశెట్టి శ్రీనివాసరావు వద్ద రూ. 1 లక్షా 9 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకున్న నగదును పోలీసుస్టేషన్ అప్పగించినట్లు తెలియజేశారు.

9.5 లక్షల నగదు పట్టివేత

- కారులో తరలిస్తుండగా స్వాధీనం

మేడికొండూరు మార్చి 28: మేడికొండూరు పోలీసు స్టేషన్ పరిధిలోని కొర్రపాడు శివారున ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోష్టు వద్ద కారులో తరలిస్తున్న 9 లక్షల 50 వేల రూపాయల నగదును గురువారం పోలీసులు పట్టివేశారు. సీఐ దార్ల జయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..

సత్తెనపల్లికి చెందిన గంగూరి రామచంద్రరావు తన క్రెటా కారులో నగదును తరలిస్తుండగా ఎస్ఐ వాసు వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. తనిఖీలో 9లక్షల 50 వేల రూపాయల నగదు కారులో దొరికింది. దీని గురించి ప్రశ్నించగా నగదుకు సంబంధించి సరైన రశీదులు లేకపోవడంతో పాటు ఎన్నికల నియమావళిలో భాగంగా 50 వేలకు మించి నగదు తరలించకూడదన్న నిబంధన మేరకు ఈనగదును సీజ్ చేసినట్లు సీఐ జయకుమార్ వివరించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

కోడ్ ఉన్నా బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం

- ఎన్నికల సమయంలో వైసీపీ నాయకుల నిర్వాకం
- టీడీపీ నాయకుల అభ్యంతరాలు
- ఎన్నికల అధికారులకు ఫిర్యాదు



పనులను అడ్డుకున్న పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, వీఆర్‌వో రమాదేవి

నూజెండ్ల, మార్చి28: ఎన్నికల సమయంలో కాంట్రాక్టర్ ప్రతినిధులు వైసీపీ నాయకులతో కలసి గుండ్లకమ్మ నది పై పాతనాగిరెడ్డి పల్లె సమీపంలో బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించేందుకు కొబ్బరికాయలు కొట్టడం వివాదంగా మారింది. గతంలో అందుగుల కొత్తపాలెం నుంచి వయా నాగిరెడ్డిపల్లి, లింగముక్కపల్లి నుంచి చింతల చెరువుకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజనలో రోడ్డు నిర్మాణం జరిగింది. ఈ నిర్మాణంలో గుండ్లకమ్మ నదిపై పాత నాగిరెడ్డిపల్లె వద్ద బ్రిడ్జి నిర్మాణం చేయలేదు. ఈనెల 7వ తేదీన ప్రభుత్వంతో కాంట్రాక్టర్ ఒప్పందం చేసుకొని ఎన్నికల కోడ్‌కు ఒక్క రోజు ముందుగా 15వ తేదీన కాంట్రాక్టర్ రూ.16 కోట్ల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా ల్యాబ్ నిర్మాణ పనులు చేపట్టారు. కాగా ఎన్నికల కోడ్ వచ్చిన అనంతరం వైసీపీ నాయకులతో కలసి నిర్మాణ పనులను ప్రారంభించటం రాజకీయంగా లబ్ధి పొందేందుకే కోడ్ ఉల్లంఘిస్తున్నారని మండలంలోని టీడీపీ నాయకులు ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి వీ రామకృష్ణ, వీఆర్‌వో రమాదేవిలు పనులు చేసేందుకు వచ్చిన కాంట్రాక్టర్ ప్రతినిధులకు పనులు నిలిపివేసి పొక్లెయినర్‌ను వెనక్కి తీసుకువెళ్ళాలని సూచించటంతో నిర్మాణ పనులను ప్రారంభించ లేదు. ఈ విషయ మై ఎంపీడీవో టీ వీరభద్రాచారిని వివరణ కోరగా ఎన్నికల కోడ్ రాక ముందు నిర్మాణంలో ఉన్నటువంటి పనుల వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేశామని, నూతనంగా నిర్మించనున్న బ్రిడ్జి విషయంపై ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించి అమలు చేయనున్నామని తెలిపారు.

వైసీపీ ఆత్మీయ సమావేశంలో ఫీల్డ్ అసిస్టెంట్



వేల్పూరులో అనిల్‌కుమార్‌యాదవ్‌తో కరచాలనం చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

శావల్యాపురం, మార్చి 28: ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ప్రభుత్వ ఉద్యోగులెవ్వరూ రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనకూడదని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొందరు ప్రభుత్వ ఉద్యోగులు అవేమీ తమకు పట్టవన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో తరచూ పాల్గొంటూ నాయకుల వద్ద వారి స్వామి భక్తిని చాటుకొంటున్నారు. ఈనెల 27వతేదీన మండలంలోని వేల్పూరు గ్రామంలో ఉన్న బొల్లా హనుమయ్య, మాణిక్యమ్మల కళ్యాణ వేదికలో వైసీపీ కార్యకర్తలతో అనిల్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో చిన్నకంచెర్ల గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ముంద్రు ప్రభు పాల్గొని ఎంపీ అనిల్‌కుమార్‌తో పరిచయం చేసుకొంటూ కరచాలనం చేస్తున్నట్లుగా ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై ఎంపీడీవో కొర్రపాటి కవితాచౌదరిని వివరణ కోరగా విషయం తమ దృష్టికి రాగానే ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభుకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌కు జరిగిన విషయాన్ని తెలియజేశామన్నారు. డ్వామా పీడీ ఆదేశాల మేరకు ఫీల్డ్ అసిస్టెంట్‌పై తదుపరి చర్యలు తీసుకొంటామన్నారు.

అసలే ఎండ.. ఆపై ఉక్కపోత

- అనధికారంగా తరగతులు.. ఉక్కిరిబిక్కిరైన విద్యార్థులు

రెంటచింతల, మార్చి 28: అత్యధిక ఉష్ణోగ్రతకు పేరుగాంచిన రెంటచింతలలో విద్యార్థులు పది రోజులపాటు ఇక్కట్లు పడ్డారు. అసలే ఎండ, ఆపై తీవ్ర ఉక్కపోతతో విద్యార్థులు ఈ పరీక్షలు ఎప్పుడు ముగుస్తాయా అని ఎదురుచూశారు.. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రమైన రెంటచింతలలో నాలుగు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరిగాయి. ఇందులో రెండు ఎయిడెడ్ కాగా మిగిలిన రెండు ప్రైవేటు పాఠశాలలు. ఈ పాఠశాలల్లో ఉదయం 9 నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు ముగిసిన అనంతరం విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా మిగిలిన తరగతుల విద్యార్థులకు కొన్ని పాఠశాలలు మధ్యాహ్నం నుంచి ఒంటి పూట బడులు నడిపాయి. ఎండ తీవ్రతకు పది రోజులపాటు కింది స్థాయి తరగతి విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. దూరాభారం నుంచి వచ్చే విద్యార్థులు ఎండ వేడిమికి తట్టుకోలేక అవస్థలు పడ్డారు. ఈ క్రమంలో గురువారం ఎంఈవో - 2 శివనాగేశ్వరరావు పరీక్షలు జరిగిన కేంద్రాలను పరిశీలించారు. శనివారం ఉదయం నుంచి ఒంటిపూట బడులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.



వెంకటపాలెంలో నిరసనలు వ్యక్తం చేస్తున్న మహిళలు, రైతులు

అడ్డగోలు పాలనకు చరమ గీతమే

- 1563 రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మార్చి 28: అడ్డగోలు వైసీపీ పాలనకు చరమగీతం పాడటానికి ప్రజలు సిద్దంగా ఉన్నారని 33 వేల ఎకరాల భూములు రాజధాని అమరావతి కోసం త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పును అమలు చేయాలంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఉద్యమం గురువారం నాటికి 1563 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మూడు రాజధానులంటూ ప్రాంతాల మధ్య విద్వేషాలకు సీఎం జగన్‌రెడ్డి ఆజ్యం పోయాలని చూశాడన్నారు. మూడు ముక్కలాటతో రాష్ట్ర సర్వనాశనమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

1,12,869 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,03,020 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,12,869 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 73,721 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	9200	15000
273	9000	13000
341	9200	19500
4884	9200	17500
సూపర్ 10	11500	13000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21000
బ్యాడిగి	9000	20000
దేవనూరు డీలక్స్	9000	20000
తెలకాయలు	5000	11000



పూజారి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న దండమూడి విజయ్

మానవత్వాన్ని చాటిన 'స్నేహ హస్తాలు'

- పూజారి గుండె శస్త్రచికిత్సకు రూ.9 లక్షల ఆర్థికసాయం

గుంటూరు(విద్య),మార్చి28: స్నేహహస్తాలు ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ మిత్రులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. అమృతలూరు మండలం ప్యాపర్రు గ్రామానికి చెందిన పేద పూజారి పొన్నూరు శ్రీనివాసరావు గుండె ఆపరేషన్ ఖర్చులకు అదే గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రులు గడ్డిపాటి షర్మిల స్పందించి స్నేహహస్తాలు ఫౌండేషన్ సభ్యులు, తన తోటి స్నేహితుల సహకారంతో రూ.9 లక్షల ఆర్థిక సహాయం అందించారు. ట్రస్టీ దండమూడి విజయ్ చేతుల మీదుగా పూజారి సతీమణి సౌజన్య, కుటుంబసభ్యులకు గురువారం అరండల్‌పేట బంధువుల ఇంటిలో అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టీ దండమూడి విజయ్, మేనేజింగ్ ట్రస్టీ ఎంవీ.రావు, కార్యదర్శి ఏ బాల మురళీకృష్ణ, కోఆర్డినేటర్ టీ కరిముల్లా, ఎం.రాధికారాణి, జీపీ హరి, కౌశిక, ఇందుప్రియ తదితరులు పాల్గొన్నారు.


చైతన్యరథం ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శివశంకర్

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

● కలెక్టర్ శివశంకర్ లోతేటి ● పట్టణంలో ఓటర్ల చైతన్యరథం ర్యాలీ

మాచర్లటౌన్, మార్చి 28: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో గురువారం పట్టణంలో అధికారులు, విద్యార్థులతో కలిసి ఓటర్ల చైతన్యరథం ర్యాలీని ప్రారంభించారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం నుంచి రింగురోడ్డు వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. అలాగే 'సి విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఏవైనా సమస్యలుంటే అందులో ఫిర్యాదు చేస్తే రెండు గంటల్లో పరిష్కరిస్తామన్నారు. ఓటర్లు కులం, మతం చూడకుండా, ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్, తహసీల్దార్ మంజునాథరెడ్డి, మునిసిపల్ కమిషనర్ వెంకటదాసు, ఎంపీడీవో సరోజినిదేవి తదితరులు పాల్గొన్నారు.


మాజీ కౌన్సిలర్‌ను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణ దేవరాయలు

ఎంపీ లావు సమక్షంలో టీడీపీలోకి చేరికలు

మాచర్లటౌన్, మార్చి 28: పట్టణంలోని 22వ వార్డుకు చెందిన వైసీపీ నేత, మాజీ కౌన్సిలర్ తిరుమలకొండ హనుమాయమ్మ ఆంజనేయులు గురువారం ఆపార్టీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు ఆధ్వర్యాన మాజీ కౌన్సిలర్‌తోపాటు మరో పది వైసీపీ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. టీడీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు వీరికి టీడీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత సామినేని నరసయ్య, కుర్రి శివారెడ్డి, కొమెర అనంతరాములు, కొమెర దుర్గారావు, మద్దిగపు చిన వెంకటరామిరెడ్డి, బండ్ల బ్రహ్మం పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మార్చి 28 : నారా చంద్రబాబు నాయుడు సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని 30వ వార్డులో కన్నా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించాలన్నారు. ఇంటింటికి తిరిగి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. వార్డులో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కన్నా లక్ష్మీనారాయణకు ఘనంగా స్వాగతం పలికారు. ప్రచారంలో టీడీపీ నేతలు చౌటా శ్రీనివాసరావు, కటకం రామకృష్ణ, పాతిమా, సయ్యద్ పెద కరిముల్లా, జానీ ఖాజావలి, సైదా, ఆతుకూరి నాగేశ్వరరావు, సయ్యద్ పెద కరిముల్లా, హుస్సేన్, కట్టా శంకరరావు, చవితి భవన్నారాయణ, శిరిగిరి మణికంఠ, 30వ వార్డు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలు వినియోగించు కోవాలి

సత్తెనపల్లి రూరల్, మార్చి 28 : ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు వినియోగించు కోవాలని మాజీ మంత్రి, సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని పెద మక్కెనలో గురువారం శ్రావణి హాస్పటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని కన్నా ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్న శ్రావణి హాస్పటల్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. అనంతరం వైద్యులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. శిబిరంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, ఆళ్ళ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక.. మండలంలోని పెద మక్కెన గ్రామానికి చెందిన తాటికొండ వసంత, తాటికొండ కొండలు, ఉడుముల శ్రీనివాసరెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు గురువారం కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. కన్నా వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నాగరాజును పరామర్శించిన కన్నా.. మండలంలోని అబ్బూరు గ్రామానికి చెందిన దార్ల నాగరాజు ఇటీవల ప్రమాదానికి గురై ఇంటి వద్ద చికిత్స పొందుతుండగా, కన్నాలక్ష్మీనారాయణ గురువారం అబ్బూరువెళ్ళి నాగరాజును పరామర్శించారు. నాగరాజు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. చికిత్స నిమిత్తం నాగరాజుకి అండగా ఉంటానని కన్నా భరోసా ఇచ్చారు.

బాలసదన్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

పిడుగురాళ్ల, మార్చి 28: బాలసదన్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ఖాళీలను భర్తీ చేశామని పల్నాడుజిల్లా ఐసీడీఎస్ పీడీ ఉమారాణి తెలిపారు. గురువారం పిడుగురాళ్ల ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. వివిధ రికార్డులను పరిశీలించడంతో పాటు సూపర్‌వైజర్లకు తగు సూచనలు చేశారు. అనంతరం లెనిన్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి బాలసదన్ హాస్టల్‌ను పరిశీలించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యం, చదువు వివరాలు, సౌకర్యాలగురించి తెలుసుకున్నారు. పిడుగురాళ్లలో బాలసదన్ పాఠశాల గత పన్నెండు సంవత్సరాలుగా నిర్మాణం అసంపూర్తిగానే నిలిచిపోవడాన్ని పరిశీలించామని, ఉన్నతాధికారులకు పరిస్థితిని వివరించి నిధులు మంజూరయ్యేలా చూస్తామన్నారు కార్యక్రమంలో స్థానిక సీడీపీవో శ్రీవల్లి, సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలని కమిషనర్‌కు వినతి

పిడుగురాళ్ల, మార్చి 28: పట్టణంలోని 25వ వార్డులో తాగునీటి సమస్య అధికంగా వున్నా పట్టించుకోవడం లేదని సుమారు 50 మందికి పైగా వార్డులోని ముస్లిం మహిళలు, మునిసిపల్ వైస్‌చైర్మన్ నసీమా భర్త జైలాబ్దిన్‌లు మునిసిపల్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. అనంతరం కమిషనర్ గిరికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రంజాన్ పండుగ నెలలో ముస్లింలు, మహిళలు ఉపవాస దీక్షలలో ఉంటారని, ఈ సమయంలో వార్డులో తాగునీరు అందకుంటే ఎలాగని కమిషనర్‌ను నిలదీశారు. తమ ప్రాంతంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

విద్యార్థులకు ఎంసెట్ మెటీరియల్ అందజేత

మాచర్ల రూరల్, మార్చి 28: పట్టణంలో ఎంసెట్‌కు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో షార్ట్ టర్మ్ కోచింగ్ అందిస్తున్నారు. ఈ మేరకు గురువారం ఎస్ఎఫ్ఐ మాజీ నేత రమేష్ విద్యార్థులకు ఎంసెట్ మెటీరియల్‌ను అందించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రమేష్ కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు జ్యోతిష్‌కుమార్, చైతన్య రాఘవ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ

20వ వార్షికోత్సవం ప్రారంభం

రెంటచింతల,మార్చి 28 : మండల కేంద్రమైన రెంటచింతలలోని సుబ్బన్న తోటలో వేంచేసి యున్న శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ 20వ వార్షికోత్సవం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైనట్లు ఆలయ చైర్మన్ నాళం పెదబాబు తెలిపారు. ఆలయ పూజారులు మారుతి,చంద్రశేఖర శర్మల నేతృత్వంలో సుప్రభాత సేవ,గణపతి పూజ,అఖండ దీపారాధన, పంచామృతాభిషేకం,లక్ష్మీగణపతి హోమాలు నిర్వహించారు. వార్షికోత్సవం నేపథ్యంలో ఆలయాన్ని, ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా శోభాయమానంగా తీర్చిదిద్ది విద్యుత్ దీప కాంతులతో అలంకరించారు. ఈ వేడుకల్లో భక్తులు గణనీయంగా హాజరయ్యారు.

అధికారం లోకి రాగానే

గురజాల కేంద్రంగా పల్నాడుజిల్లా

● సైకోను ఇంటికి పంపేందుకు సంసిద్ధం కావాలి
● చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం
● గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న యరపతినేని

గురజాలటౌన్, మార్చి 28: ఒక్క ఛాన్స్ ఇవ్వండి అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని పాతాళలోకంలో పడేసిన సైకో జగన్‌ను ఇంటికి పంపేందుకు అందరూ సంసిద్ధంగా ఉండాలని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలోని చల్లగుండ్ల గార్డెన్స్‌లో బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి బాట పట్టాలంటే కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రాగానే గురజాల నియోజకవర్గంలో 1.50 లక్షల మందికి చంద్రన్న బీమాను అందిస్తామన్నారు. మేనిఫేస్టోలో ప్రకటించిన సూపర్ 6 పథకాలతో వైసీపీ నేతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. గురజాలకేంద్రంగా పల్నాడు జిల్లా ప్రకటిస్తామని ఎన్నికల మేనిఫేస్టోలో ప్రకటించే దమ్ము స్థానిక ఎమ్మెల్యే మహేష్‌రెడ్డికి ఉందా అని యరపతినేని సవాల్ విసిరారు. జిల్లాలు ఏర్పాటు సమయంలో గురజాల కేంద్రంగా పల్నాడు జిల్లా ఏర్పాటు చేయాలని పార్టీలకు అతీతంగా అందరూ పోరాడుతుంటే కనీసం స్థానిక ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి నోరు మెదపలేదని, రానున్న ఎన్నికల్లో ఓటు వేయాలని ప్రజలను ఎలా అడుగుతారని ప్రశ్నించారు. గురజాల నియోజకవర్గంలో దోచుకోవడం, నరసరావుపేటలో దాచుకోవడం తప్ప నియోజకవర్గంపై ప్రేమ ఎందుకుంటుందని, ఇప్పటికైనా నియోజకవర్గ ప్రజలు ఆలోచించాలని అన్నారు. ప్రజలు తమ ఓటును సైకిల్ గుర్తుపై వేసి తనతో పాటు నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలును అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా నేతలతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

యరపతినేని సమక్షంలో టీడీపీలోకి చేరికలు ...

పిడుగురాళ్ల: పట్టణ పరిధిలోని 5, 6 వార్డులలో నివశిస్తున్న ఎస్సీ, బీసీ, ఓసీ సామాజికవర్గాలకు చెందిన 30 కుటుంబాలు వైసీపీనీ వీడి 5వవార్డు టీడీపీ ఇన్‌చార్జి కందిమళ్ల శ్రీనివాస రావు ఆధ్వర్యంలో గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికీ యరపతినేని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాజు, పమిడి శ్రీను, ఉసిరికాయల అంకారావు, తెల్లబాటి కృష్ణ, నారాయణపురపు పేరయ్య, అంజినాయక్, మాచవరం సాగర్, ఖాశింసాహెబ్, వడ్డవల్లి సాంబశివరావు, పిల్లి చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వారితో యరపతినేని శ్రీనివాసరావు

టీడీపీ పాలనతోనే ప్రజలకు స్వేచ్ఛ

● ఒక్క అవకాశం ఇవ్వండి.. మార్పు చూపిస్తా..
● ఆత్మీయ సమావేశంలో కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డి


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

కారంపూడి, మార్చి 28: వైసీపీ పాలనలో మాచర్ల నియోజకవర్గ ప్రజలు భయాందోళనలో బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని, టీడీపీ అధికారంలోకి వస్తేనే ఇక్కడి ప్రజలకు స్వేచ్ఛ లభిస్తుందని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండలంలోని ఇనుపరాజుపల్లి, గాదెవారిపల్లె గ్రామాల్లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో బ్రహ్మారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సీఎం జగన్‌రెడ్డి వరికపూడిశెల ప్రాజెక్ట్‌కు శంకుస్థాపనలు చేయడమే గానీ నిధుల విడుదల చేసిన దాఖలాలు లేవన్నారు. టీడీపీ ప్రభుత్వం కొనసాగివుంటే ఎన్నో పరిశ్రమలు వచ్చి నిరుద్యోగ సమస్య తొలగిపోయేదన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమేనని, తనకు నాకు ఒక్క అవకాశం ఇచ్చి ఆశీర్వదించండి. నియోజకవర్గంలో అభివృద్ధి చూపిస్తానన్నారు. అనంతరం పలువురు వైసీపీ నేతలు ఆ పార్టీని వీడి బ్రహ్మారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలను కప్పి బ్రహ్మారెడ్డి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు పంగులూరి అంజయ్య, అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, బీజేపీ జిల్లా కార్యదర్శి శెట్టి హనుమంతురావు, జనసేన మండల అధ్యక్షుడు కేశానుపల్లి కృష్ణబాబు, పంగులూరి పుల్లయ్య, చిరుమామిళ్ల బుచ్చయ్యచౌదరి, ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు కాల్వ పేరయ్య, బాలునాయక్, నాగలక్ష్మిరెడ్డి, కర్లా సైదారావు, చప్పిడి రాము, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బలగాల కవాతు

మాచర్ల రూరల్, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం మండలంలోని రాయవరం, కంభంపాడు గ్రామాల్లో మాచర్ల రూరల్ ఎస్ఐ కుర్రి రాజశేఖర్ ఆధ్వర్యాన సీఐఎస్ఎఫ్, పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. ఎన్నికల నేపథ్యంలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజశేఖర్ హెచ్చరించారు.

పిడుగురాళ్ల: సాధారణ ఎన్నికల బదిలీల్లో భాగంగా గురువారం పిడుగురాళ్ల, శివారు ప్రాంతాలలో పోలీసులు కవాతు నిర్వహించారు. రైల్వేస్టేషన్ రోడ్డు, గాంధీనగర్, బ్రహ్మానందరెడ్డి కాలనీ, మొండిగేటు, బెల్లంకొండ డొంక, చెరువుకట్టబజారులో పోలీసులు కవాతు నిర్వహించారు. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ వీరాంజనేయులు, ఎస్ఐ పఠాన్ రబ్బానీఖాన్, అమీర్, ఏఎస్ఐలు శ్రీనివాసరావు, కొండలరావు పాల్గొన్నారు.

సత్తెనపల్లిరూరల్: మండలంలోని లక్కరాజుగార్లపాడు, పాకాలపాడు గ్రామాల్లో గురువారం రూరల్ సీఐ ఎం రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో రూరల్ పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది కవాతు నిర్వహించారు. రాబోయే ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ప్రశాంత ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గ్రామస్థులతో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు.

ఎట్టకేలకు విగ్రహాలకు ముసుగులు

● ఆంధ్రజ్యోతి కథనంతో కదిలిన అధికారులు

రెంటచింతల,మార్చి 28: 'కోడ్ అమలులోను రంగులు చెరిపేయరా' అనే శీర్షికతో గురువారం ఆంధ్రజ్యోతి దినప్రతికలో ప్రచురితమైన కథనం ఎట్టకేలకు అధికారులను కదిలించింది. మండలంలోని రెంటాల, గోలి గ్రామాల్లో విగ్రహాలకు ముసుగులు లేకపోవడం, పలు ప్రాతాల్లో వైసీపీ రంగులు ఉండటంతో ఎన్నికల ప్రవర్తనా నియావళి అమలు అధికారి పెదప్రోలు శంకరరావు స్పందించారు. ఈవిషయంపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేయడంతో వారు ఉరుకులు పరుగుల మీద విగ్రహానికి ముసుగు తొడిగి వైసీపీ రంగులను చెరిపేసి తెల్ల రంగు వేసినట్లు ఎన్నికల ప్రవర్తనా నియావళి అమలు అధికారి పెదప్రోలు శంకరరావు తెలిపారు.

పేదల అభ్యున్నతికే 'సూపర్ సిక్స్'

దుర్గి, మార్చి 28: పేదల అభ్యున్నతికి ఎంతో ముందుచూపుతో ఆలోచించి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలను మేనిఫేస్టోలో పొందుపరిచారని ముటుకూరు మాజీ సర్పంచ్ లింగా పుల్లయ్య అన్నారు. గురువారం మండలంలోని ముటుకూరులో టీడీపీ నేతలు సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి తిరిగి వివరించారు. కార్యక్రమంలో లింగా రమేష్, సాంబశివరావు, దొండపాటి చెన్నయ్య, లింగా బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

మాచవరం, మార్చి28: అన్ని గ్రామాల్లో ఈనెల 31నాటికి ఇంటి పన్ను వసూలు నూరుశాతం పూర్తిచేయాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులను నరసరావుపేట డీఎల్పీవో రమణయ్య ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించి గ్రామాల వారీగా ఇంటి పన్ను వసూలుపై సమీక్ష నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో వసూళ్లలో మరీ తక్కువశాతం వుండటంతో 31వ తేదీనాటికి నూటికి నూరుశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా లైసెన్స్ ఫీజులను నూటికి నూరు శాతం వసూలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో డీ. సురేష్, ఈవోఆర్డీ వెంగళరావు, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఆర్వోప్లాంట్ ఏర్పాటు

అచ్చంపేట, మార్చి 28 : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.1.25 లక్షల విలువచేసే ఆర్వో వాటర్ ఫిల్టర్‌ను చామర్రు గ్రామానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి ఉప్పల శ్రీనివాసమూర్తి ఏర్పాటు చేశారు. ఈవాటర్ ఫిల్టర్‌ను గురువారం శ్రీనివాసమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి పసుపులేటి పాపిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ కల్యాణి, అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాసమూర్తి, ఉపాధ్యక్షుడు సూర్య సంపత్, వీరవల్లి కిషోర్, మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్తిపన్నుచెల్లింపుపై వడ్డీ రాయితీ

సత్తెనపల్లి, మార్చి 28: ప్రజలు మునిసిపాలిటీకి చెల్లించాల్సిన ఆస్తి పన్ను చెల్లింపుపై వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ షమ్మి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ పన్ను రాయితీ ద్వారా బీఎస్ఎన్ఎల్ టెలికమ్ భవనంకు రూ.23 లక్షల వడ్డీని మాఫీ చేసినట్లు ఆయన తెలిపారు. ఆస్థి పన్ను పై రాయితీని ప్రతి ఒక్కరు వినియోగించు కోవాలన్నారు. పట్టణంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల నుంచి పేరుకుపోయిన పన్ను బకాయిలను వసూలు చేయాల్సి ఉందని తెలిపారు.

చామర్రులో టీడీపీ నేతల ప్రచారం

అచ్చంపేట, మార్చి 28: మండల కేంద్రమైన అచ్చంపేట పంచాయతీ పరిధిలోని చామర్రు గ్రామంలో టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌ను గెలిపించాలని కోరుతూ టీడీపీ నేతలు గురువారం రాత్రి ప్రచారం నిర్వహించారు. పెదకూరపాడు నియోజక వర్గాన్ని బాష్యం ప్రవీణ్ అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తారని, టీడీపీ ప్రవేశ పెట్టిన మేనిఫెస్టో అమలు చేస్తారని, సైకిల్‌గుర్తుకు ఓటువేసి ప్రవీణ్‌ను గెలిపించలన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో భాష్యం ప్రవీణ్ సోదరుడు భాష్యం నవీన్, కీర్తితో పాటు కూటమి నేతలు పాల్గొన్నారు.

నేడు ఫుట్‌బాల్ బాలుర జట్టు ఎంపిక

సత్తెనపల్లి, మార్చి 28: ఆంధ్రప్రదేశ్ ఫుట్ బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న మధ్యాహ్నం 3 గంటలకు అండర్-20 బాలురజట్టుకి ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వరరావు గురువారం తెలిపారు. స్థానిక సుగాలీ కాలనీ ఉన్నత పాఠశాలలో ఈ ఎంపికలు జరుగుతాయని, పాల్గొనదలచిన క్రీడాకారులు 2005 నుంచి 2007 మధ్య పుట్టి ఉండాలన్నారు. పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో ఎంపికకు హాజరు కావాలని ఆయన సూచించారు.

టీడీపీ గెలుపు ఎమ్మార్పీఎస్ లక్ష్యం

● మహజన సోషలిస్టు పార్టీ అధ్యక్షుడు కోటేశ్వరరావుమాదిగ

నకరికల్లు, మార్చి 28 : రానున్న సాధారణ ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ పనిచేస్తుందని మహజన సోషలిస్టు పార్టీ పల్నాడుజిల్లా అధ్యక్షుడు కనుమూరి కోటేశ్వరరావు మాదిగ తెలిపారు. గురువారం నకరికల్లులో మహజన సోషలిస్టు పార్టీ నేతలతో ఆయన జిల్లాలో ఎన్నికల పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక 27 ఎస్సీ సంక్షేమ పథకాలను రద్దుచేసిందని, సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్ళించారని, ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగాయని అన్నారు. ఈ దఫా ఎన్నికల్లో వైసీపీ ఓటమి మాదిగల పంతంగా మారాలని కోటేశ్వరరావు పిలుపు నిచ్చారు. ఎస్సీల్లో ఏబీసీడీ వర్గీకరణకు ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు, టీడీపీ, బీజేపీ కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో కనుమూరి శ్యామ్‌సోన్, యాకోబు, ఘంటా ఎలీషా, వెంకట కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

టెయిల్‌పాండ్ ప్రాజెక్టు విద్యుత్ ఉద్యోగుల నిరసన

రెంటచింతల,మార్చి 28: సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఉద్యోగులు గురువారం భోజన విరామ సమయంలో ప్రాజెక్టులో పరిపాలన భవనం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగ సంఘ నేతలు మాట్లాడుతూ.. బయోమెట్రిక్‌కు ఉద్యోగుల జీతాలకు లింక్ పెట్టడంపై ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎస్ఈ వెంకట రమణకు అందచేశారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి మల్లేష్, కన్వీనర్,కో కన్వీనర్లు కిరణ్‌కుమార్, సుబ్బారావు పాల్గొన్నారు.


ఎస్ఈ వెంకటరమణకు వినతిపత్రం అందచేస్తున్న విద్యుత్ ఉద్యోగులు


జయహో బీసీ సమావేశంలో మాట్లాడుతున్న భాష్యం ప్రవీణ్

బీసీ సంక్షేమం, అభ్యున్నతికి పెద్దపీట

● పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్

అమరావతి, మార్చి 28: బీసీ సంక్షేమానికి పెద్దపీట వేస్తూ మాజీ సీఎం ఎన్టీ రామారావు నాడు టీడీపీని స్థాపించారని, అనంతరం చంద్రబాబు బీసీ అభ్యున్నతికి కృషి చేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలుచే శారని పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం ఉదయం ధరణికోట గ్రామంలోని జేబీ గార్డెన్స్‌లో నిర్వహించిన 'జయహో బీసీ' సమావేశంలో ప్రవీణ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీల సంక్షేమం, అభ్యున్నతి ఎక్కడా కనిపించలేదన్నారు. బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన వైసీపీ నాయకులు బీసీలను అన్నివిధాలా అణిచివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తేనే బీసీలకు న్యాయం, రక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీసీ నేతలు మద్దిరాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకమ్మ ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో.. మండల పరిధిలోని ధరణికోట గ్రామదేవత అద్దంకమ్మ, చేకూరి, పాములపాటి, వడ్లమూడి వారి కులదేవత తరుణమ్మ దేవతల విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.


భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

అమరావతిలో వైసీపీకి భారీ షాక్

● భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలోకి 150 కుటుంబాలు..

అమరావతి, మార్చి 28: అమరావతి మండల కేంద్రంలో అధికార వైసీపీకి భారీ షాక్ తగిలింది. కొద్దిరోజుల క్రితం సుమారు 60కుటుంబాలు కాపునాడు జిల్లా అధ్యక్షులు పోలిశెట్టి వెంకటసత్యనరాయణ ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలోకి చేరిన విషయం తెలిసిందే. గురువారం మళ్లి వైసీపీ నేత విన్నకోట సాంబశివరావు, వైసీపీ అమరావతి పట్టణ అధ్యక్షుడు విన్నకోట శివయ్యల ఆధ్వర్యంలో సుమారు 150 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సమక్షంలో వారంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కొద్ది రోజుల వ్యవధిలోనే సుమారు 210 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ పార్టీలోకి వచ్చిన వారు టీడీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు.


మాచవరంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌అలి తదితరులు

ముస్లింలను దగా చేసిన వైసీపీ

● పల్నాడు జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు అమీర్‌అలి

మాచవరం, మార్చి 28: రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలను వైసీపీ ప్రభుత్వం దగా చేసిందని, రానున్న సాధారణ ఎన్నికలలో వైసీపీ అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించాలని పల్నాడు జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు అమీర్‌అలి సూచించారు. గురువారం మాచవరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014 నుండి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం ముస్లింలకు 14 రకాల సంక్షేమ పథకాలు అందించి ఒక స్వర్ణయుగంలా పరిపాలన చేసిందన్నారు. ఆరు రకాల నిత్యావసర సరుకులతో రంజాన్ తోఫాను అందించిందన్నారు. పేద ముస్లిం మహిళల వివాహాలకు దుల్హన్‌పథకం ద్వారా రూ.50 వేలు, ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు, రంజాన్‌మాసంలో మసీదులను అలంకరించేందుకు రూ.10వేల నుండి రూ.25 వేల వరకు అందించారన్నారు. గురజాల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో యరపతినేని శ్రీనివాసరావు ప్రత్యేకంగా ముస్లింల సంక్షేమానికి రూ. కోట్లు ఖర్చుచేశారన్నారు. 2019లో ఎమ్మెల్యేగా వచ్చిన కాసు మహేష్‌రెడ్డి ముస్లింలకు నాలుగు పదవులిచ్చి ఏదో వెలగబెట్టినట్లు గొప్పలు చెబుతున్నారన్నారు. మాచవరంలో షాదీఖానాను యరపతినేని 80 శాతం పూర్తిచేస్తే మిగిలిన 20 శాతం కూడా పూర్తిచేయలేకపోయారన్నారు. తురకపాలెంలో మదర్‌సాకు రూ.10 లక్షలు యరపతినేని మంజూరు చేయిస్తే కాసు మహేష్‌రెడ్డి ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. గురజాలలో యరపతినేని గెలుపు తథ్యమని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మాబువలి, గురజాల నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు షేక్ అబ్దుల్లా, మాచవరం మండల తెలుగుయువత అధ్యక్షులు షేక్ హసన్‌వలి, మాచవరం మండల మైనారిటీ విభాగం అధ్యక్షులు మోమిన్ సైదావలి, పట్టణ అధ్యక్షులు షేక్ అబ్దుల్లా, షేక్ భషీర్, ఇబ్రహీం, అల్లావుద్దీన్, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య నేతలతో యరపతినేని భేటి

పిడుగురాళ్ల, దాచేపల్లి, మార్చి 28: గురజాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు ముఖ్యనేతలను ప్రత్యేకంగా కలుస్తున్నారు. పిడుగురాళ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, మాజీ ఎంపీపీలు అంబటి నవకుమార్, అంబటి శేషగిరిరావు, పేదల వైద్యుడుగా పేరొందిన కనుమూరి ఆస్పత్రి అధినేత క్రాంతికుమార్, విక్రాంత్, గీతారాణితో పాటు కాపునేతలు కొప్పుల గిరి, నరసింహారావు, మరికొందరు ముఖ్యనేతలను ఇంటికి వెళ్లి యరపతినేని కలిశారు. అలాగే దాచేపల్లికి చెందిన తంగెడ మాజీ సర్పంచ్ బీరవల్లి భారతిరెడ్డి కూడా పిడుగురాళ్లలో యరపతినేనిని కలిశారు. తామంతా యరపతినేని నాయకత్వంలో పనిచేసేందుకు సంసిద్ధంగా వున్నామని ఆమె తెలిపారు. మల్లెల ఆదినారాయణ, గుదె లక్ష్మణ్‌బాబు, ప్రముఖ న్యాయవాది ఆలేటి మల్లికార్జునరావులతో యరపతినేని భేటీ అయ్యారు.

ప్రచారాలకు వలంటీర్లు దూరంగా ఉండాలి

సత్తెనపల్లి, మార్చి 28: వలంటీర్లు ఎన్నికల ప్రచారాలకు దూరంగా ఉండాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ ఎన్నికల అధికారి మురళీకృష్ణ గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలుచేస్తున్నామన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు కోసం ఏప్రిల్ 8వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు, దివ్యాంగులు ఫాం-డీ పూర్తి చేసి అందజేస్తే ఇంటి వద్దే ఓటువేసే అవకాశం కల్పిస్తామన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు కచ్చితంగా ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ.. వ్యక్తికి గాయాలు

మాచర్లటౌన్, మార్చి 28: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన మాచర్ల పట్టణ శివారులోని కొత్తపల్లి జంక్షన్ వద్ద జరిగింది. గురువారం రాత్రి మాచర్ల మండలం విజయపురిసౌత్‌కు చెందిన శ్రీను ద్విచక్ర వాహనంపై మాచర్లకు వస్తున్నారు. మార్గ మధ్యంలోని కొత్తపల్లి జంక్షన్ వద్దకు రాగానే వెనుకగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో శ్రీనుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఎన్నికల నిర్వహణపై అధికారుల సమీక్ష



ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్వో సుబ్బారావు, డీఎస్పీ వర్మ

వినుకొండ, మార్చి 28: ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నర్సరావుపేట డీఎస్పీ వర్మ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్వో సుబ్బారావు అధ్యక్షతన ఎన్నికల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వర్మ మాట్లడుతూ ఎన్నికల నియమావళి అమలు అంశాలను క్షేత్రస్థాయిలో పర్యటించే బృందాలు కీలక బాధ్యత వహించి ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాజకీయ పార్టీలు ప్రచారం ప్రచురణ కోసం తప్పనిసరిగా అనుమతి పొందాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. చెక్‌పోస్టుల వద్ద పోలీసుల నిఘా పెంచామని ప్రతిరోజు విధిగా వాహన తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. రూ.10వేలు విలువైన వస్తువు తరలింపునకు బిల్లులు తప్పనిసరి అని, 50వేలు మించిన నగదు తీసుకు వెళ్ళేవారు సరైన పత్రాలు లేకపోతే నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో అక్రమమద్యం నిల్వలు, ఇతర రాష్ట్రాల నుంచి మద్యం దిగుమతులు అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించి ప్రశాంతంగా ఎన్నికలు జరిపేందుకు ప్రజల్లో నమ్మకం కల్గించడం జరుగుతుందన్నారు. అనంతరం నిర్మలా స్కూల్‌లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. సాయంత్రం వినుకొండ పట్టణంలోని పురవీధుల్లో కేంద్ర బలగాలతో డీఎస్పీ ఆధ్వర్యంలో రూట్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐలు సాంబశివరావు, సుధాకర్‌లతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్, సెక్టార్ ఇన్‌చార్జిలు, ఏఈవో తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక ఫాగింగ్ డ్రైవ్ ప్రారంభం

నరసరావుపేట రూరల్, మార్చి 28: అధునాతన ఫాగింగ్ మిషన్ల ద్వారా దోమల నివారణ కు చర్యలు చేపట్టినట్లు మునిసిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి తెలిపారు. నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడానికి కొత్తగా అధునాతనమైన ఫాగింగ్ మిషన్లను మున్సిపల్ కమిషనర్ సి రవిచంద్ర రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ కనకరావు, మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్ ఓలేటి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. పురపాలక సంఘం పరిధిలో 1 మెగా ఫాగింగ్ మిషన్, 6 హ్యాండ్ ఫాగింగ్ మిషన్లు శుక్రవారం ప్రారంభించారు. పట్టణంలో ప్రతి రెండు లేదా మూడు రోజులకు ఒకసారి 34 వార్డుల్లో పూర్తిస్థాయిలో ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకు సంబంధించి ఒక షెడ్యూల్ ఏర్పాటు చేయమని కమిషనర్ సంబంధిత శానిటేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

సైనిక సంక్షేమ నిధికి ఎన్‌ఈసీ కళాశాల విద్యార్థుల విరాళం

నరసరావుపేట రూరల్, మార్చి 28: స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం సహకారంతో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాలు సంయుక్త ఆధ్వర్యంలో సైనికుల సంక్షేమ నిధికి రూ.20,000/-లు విరాళం అందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.శ్రీనివాస కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల నుంచి ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛందంగా విరాళాలు వసూలుచేశారు. ఈ మొత్తాన్ని పల్నాడు జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్.గుణశీల సూచనల మేరకు సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బందికి అందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

కేజ్రీవాల్ అరెస్టు అక్రమం: ఇండియా కూటమి నేతలు

వినుకొండ, మార్చి 28: ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అర్‌విండ్ కేజ్రీవాల్ అక్రమ అరెస్టును ఇండియా కూటమి నేతలు ఖండించారు. పట్టణంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం ఆమ్‌ఆద్మీ పల్నాడు జిల్లా కార్యదర్శి పులిమల రూబెన్ అధ్యక్షత నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి బాలసుబ్రహ్మణ్యం మాట్లడుతూ ఆమ్‌ఆద్మీ పార్టీ ఇండియా కూటమిలో చేరినందుకు కేంద్రం కక్షకట్టిందన్నారు. అవినీతిపై పోరాడినెగ్గి జాతీయ పార్టీగా ఎదుగుతున్న తరుణంలో జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై అక్రమంగా తప్పుడు కేసు బనాయించి అరెస్టు చేయడం అనాగరికం అన్నారు. బీజేపీ ప్రతిపక్ష పార్టీ నాయకులపై దాడులు చేయించి భయభ్రాంతులకు గురిచేస్తూ ఎన్డీఏ కూటమిలో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. భయపడనివారిపై కేసులు పెట్టి జైలుకు పంపే కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. భారత రాజ్యాంగాన్ని భారతదేశాన్ని కాపాడుకోవల్సిన పరిస్థితి ఇండియా కూటమిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో కోల నవజ్యోతి, పీడీఎం నాయకులు వెంకటేశ్వర్లు, బాజి, ఎమ్మార్పీఎస్ నాయకులు రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, రాష్ట్ర గిరిజన సంఘం నాయకులు కోట నాయక్, ఏపీసీఎల్‌సీ నాయకులు పేరయ్య బూదాల శ్రీనివాసరావు, లిబరేషన్‌పార్టీ నాయకులు తోట అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 6న జేఎన్‌టీయూలో టెక్నికల్ సింపోజియం

నరసరావుపేట టౌన్, మార్చి 28: జేఎన్‌టీయూ కళాశాలలో ఏప్రిల్ 6న జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం కళాశాలలో సింపోజియంకు సంబంధించిన లూసెంట్ 2కె24 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జాతీయస్థాయి సాంకేతిక సదస్సు నూతన ఆవిష్కరణలకు నిలయంగా ఉంటుందని, అన్ని కళాశాలల విద్యార్థులు ఈ ఈవెంట్‌లో పాల్గొని సాంకేతిక పరిజ్ఞానం పొందాలని కోరారు. సర్వేయింగ్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ డీజీపీఎస్ మీద వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వైఎస్ కిషోర్‌బాబు, సమన్వయకర్త పొట్ల మణికంఠ, విష్ణు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో గోపయ్య, లక్ష్మీతిరుపతమ్మ

శావల్యాపురం, మార్చి 28: మండలంలోని పొట్లూరు పంచాయతీ పరిధిలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్దనున్న గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవాలయం వద్ద తిరునాళ్ల వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామునే దేవాలయానికి చేరుకొని లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యలకు పాలాభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేకపూజలు చేశారు. దేవాలయ ఆవరణలో మహిళలు పొంగలివండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ ధర్మకర్త గోనుగుంట్ల వెంకట్రావు, కమిటీసభ్యులు విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం పోట్లూరు, కృష్ణాపురం, శావల్యాపురం, తుమ్మలకుంట, కనమర్లపూడి గ్రామాల నుంచి భక్తులు కుంకుమ బండ్లు కట్టుకుని వచ్చారు. రాత్రి దేవాలయం వద్ద భక్తులు భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా ఎస్ఐ చల్లా సురేష్ దేవాలయం వద్ద పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

● వినుకొండ టౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని తిరుపతమ్మ అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవ కార్యక్రమాన్ని భక్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆలయ ఆవరణలో పొంగళ్లు నిర్వహించి మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థులు లక్ష్యాలను నిర్ణయించుకోవాలి

● వాసవి డిగ్రీ కాలేజీ వార్షికోత్సవంలో డీఎస్పీ శర్మ

నరసరావుపేట టౌన్, మార్చి 28: విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలను డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే ఏర్పరుచుకోవాలని డీఎస్పీ వీఎస్ఎస్ శర్మ అన్నారు. వాసవి డిగ్రీ కాలేజీ 22వ వార్షికోత్స వేడుకలు నరసరావుపేట పట్టణంలోని జమీందార్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించామని ప్రిన్సిపాల్ పీ చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ వీఎస్ఎస్ శర్మ మాట్లాడుతూ లక్ష్యసాధనలో విద్యార్థులు, కళాశాల అధ్యాపకుల, తల్లిదండ్రుల సహకారం తీసుకోవాలన్నారు. విశ్వవిద్యాలయ, పట్టణ స్థాయిలలో అత్యధిక మార్కులు, క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మరో అతిథి వన్ టౌన్ సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పావన ప్రణతి, కళాశాల డైరెక్టర్ ఏపీఎస్ రతకుమారి, కోట సాంబశివరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కే హరికృష్ణ, వీరిశెట్టి శ్యామ్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని సీఎం అవసరమా..?

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



పార్టీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 28: రాష్ట్రవ్యాప్తంగా కరువు కరాళ నృత్యం చేస్తున్నా రైతులను, ప్రజలను కనీసం పట్టించుకోని జగన్‌లాంటి ముఖ్యమంత్రి రాష్ట్రానికి అవసరమా? అని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లోని వైసీపీ నాయకులు టీడీపీ చేరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ కరువు బాధితులను పరామర్శించటానికి ముఖం చాటేసిన ముఖ్యమంత్రి జగన్ సిద్ధం అంటూ ఊరూర ప్రచారానికి బయలుదేరటానికి సిగ్గు ఉండాలన్నారు. ఎండిన పంటలు, గొంతెండుతున్న పల్లెల గోడు కనీసమైనా వినిపించుకోని వ్యక్తి సీఎం స్థానంలో ఉండటం నిజంగా రాష్ట్రం చేసుకున్న దురదృష్టమన్నారు. కరువు మండలాల ప్రకటన నుంచి ఇదే తీరుగా వ్యవహరిస్తున్నారని, కనీసం ఉపశమన చర్యలు కూడా తీసుకోలేదని ధ్వజమెత్తారు. జగన్ అసమర్థ చేతగాని విధానాలతో ఉన్న కొద్దిపాటి నీటి వనరుల నిర్వహణను, అలసత్వం వహించటంతో కరువు కష్టాలు మరింత రెట్టింపు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యక్తి నేతృత్వంలో పని చేయలేక నిరంతరాయంగా వైసీపీ నుంచి ఇతర పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయన్నారు. తమ అధినేత చంద్రబాబు నాయుడు ఇంకా ఆచితూచి వ్యవహరిస్తున్నారని, అదే పూర్తిగా ఆయన గేట్లు తెరిస్తే వైసీపీలో ఒక్కరు మిగలరనే విషయాన్ని జగన్ ఇప్పటికైనా తెలుసుకోవాలన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో తనకు ప్రత్యర్థిగా ఎవరిని పెట్టాలో తేల్చుకోవటానికి వైసీపీకి ఇప్పటివరకు సమయం పట్టిందని, ఇక గెలుపు గురించే ఆలోచించే అవకాశం వారికి లేదన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను ఇక్కడ రికార్డుస్థాయి ఆధిక్యంతో గెలిచి తమ అధినేత చంద్రబాబుకు విజయాన్ని కానుకగా ఇవ్వటంతో పాటు వైసీపీ పన్నిన కుట్రలన్నింటికీ సరైన సమాధానం ఇస్తామని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

6, 7 వార్డులకు చెందిన పలువురు వైసీపీ నాయకులు ప్రత్తిపాటి సమక్షంలో టీడీపీలో చేరారు. 6వ వార్డు నుంచి కొణిదన దుర్గాప్రసాదు, ముత్తకూరి ఈశ్వర్, పాలెపు వెంకటేషయ్య, నాదెండ్ల శివకృష్ణ, క్రాంతి, 7వ వార్డు నుంచి గోగుల నాగరాజుతో పాటు పలువురు టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ప్రత్తిపాటి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

రాష్ట్ర గతిని మార్చబోతున్న సూపర్-6 బీసీ డిక్లరేషన్

చిలకలూరిపేట అర్బన్, మార్చి 28: తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్-6 హామీలు, బీసీ డిక్లరేషన్ రాష్ట్ర చరిత్రగతినే మార్చబోతున్నాయని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గురువారం పట్టణంలోని 38వ వార్డులో నిర్వహించిన టీడీపీ ఎన్నికల శంఖారావం, బాబు షూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాటి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక అమలు చేయబోయే సూపర్ - 6 పథకాల గురించి వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాలుగా పడుతున్న ఇబ్బందుల గురించి ఆయన వద్ద మహిళలు ఏకరువు పెట్టారు. కరెంటు బిల్లులు, బస్సు చార్జీలు అన్ని రకాల పన్నులు పెంచి సామాన్య మధ్య తరగతి వర్గాల నడ్డి విరిచారని వారు వాపోయారు. అనంతరం కుటుంబ సాధికార సారధులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులతో సమావేశం అయి బూత్‌ల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జనసేన నేత తోట రాజా రమేష్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్తిపాటి విజయానికి కృషి: జనసేన నేత

చిలకలూరిపేట, మార్చి 28: చిలకలూరిపేట టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు విజయానికి కూటమి పొత్తు ధర్మాన్ని పాటించి కూటమి పార్టీగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా కో-కన్వీనర్ పెంటేలా బాలాజీ గురువారం అన్నారు. నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యల పరిష్కారానికి ఉమ్మడి అభ్యర్థి పుల్లారావు కృషి చేస్తారని తెలిపారు. కూటమి కార్యకర్తల మధ్య విబేధాలు సృష్టించేందుకు వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

గండి గనుమలలో సుగాలీల ఆత్మీయ సమ్మేళనం



పార్టీలో చేరిన సర్పంచ్ దుర్గా శ్రీను, పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు, మక్కెన తదితరులు, సమావేశానికి హాజరైన ప్రజలు

బొల్లాపల్లి, మార్చి 28: మండలంలోని గండిగనుమల గ్రామంలో సుగాలీ, లంబాడీల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ అధికార అహంకారంతో విర్రవీగుతున్న బొల్లాకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ సేవలు స్మరించుకొని సుగాలీలు, లంబాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల ఆదరాభిమానాలతో రెండుసార్లు భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడు పార్టీ అధికారంలో లేకపోయినా చిత్తశుద్ధితో పనిచేశానన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చాక పెద్ద ఎత్తున నిధులు తెచ్చి ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. తండాలో సీసీ రోడ్లు, మౌలిక వసతులు కల్పించామన్నారు. చంద్రబాబు, లోకేశ్ సహకారంతో 2500సీసీ రోడ్లు వేశామని, తండాకు తారురోడ్లు వేయించామన్నారు. బొల్లా ఏం చేశాడో బహిరంగ చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు. బొల్లా కనీసం మురుగు కాలువలు ఏర్పాటు చేసిన పాపాన పోలేదన్నారు. పది రూపాయలకు రేషన్ బియ్యం కొనటం, టన్ను రూ.30వేలకు అమ్ముకుంటున్న పిల్లడాన్ కథను తేలుస్తామని హెచ్చరించారు. గ్రామ గ్రామాన బెల్టు షాపులు పెట్టి సీసాపై రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికైన తరువాత మొదటి పార్లమెంట్‌లో మాట్లాడి వరికపూడిసెల గురించి మాట్లాడతానన్నారు. అనుమతులు తీసుకు రాకుండా 65 సంవత్సరాలు గడిపారని, అవిలేకుండా ప్రాజెక్టు ముందుకు నడవదన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎన్నికలు వచ్చే సరికే గోదాముల్లో ఉన్న పాత చీరలు తీసుకు వచ్చి ఇంటింటికి పంచారన్నారు. జీవీ ఆంజనేయులు వినుకొండ అభివృద్ధికి రూ.160 కోట్లు తెచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు నిశ్శంకర శ్రీనివాసరావు, టీడీపీ నేతలు దారు నాయక్, గోవిందు నాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, బారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పెసల నారాయణ, కోటా నాయక్, మంగా బాయి, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా జరగనున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి జీవీ ఆంజనేయులును, లావు శ్రీకృష్ణదేవరాయలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పలువురు కోరారు.

పలువురు టీడీపీలో చేరిక

గండిగనుమల గ్రామంలో గురువారం రెండు వందల వైసీపీ కుటుంబాలు పార్టీలో చేరినట్టు జీవీ ఆంజనేయులు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ఆ గ్రామ సర్పంచ్ దుర్గా శ్రీను, పలువురు వైసీపీ కార్యకర్తలు, నాయకులు టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు, మక్కెన మల్లిఖార్జునరావు, గోవిందు నాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, దారు నాయక్, కోటా నాయక్, హనుమా నాయక్, మంగా బాయి, శాఖమూరి రామ్మూర్తి తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అన్నవరంలో తెలుగుదేశం పార్టీలో చేరిన వారితో అరవిందబాబు, కోటేశ్వరరావు తదితరులు

వైసీపీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు టీడీపీలో చేరిక

రొంపిచర్ల, మార్చి 28: మండలంలోని అన్నవరంలో వైసీపీ నుంచి టీడీపీలోకి గురువారం పలువురు చేరారు. వీరంతా టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి చదలవాడ అరవింద బాబు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావుల సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. సర్పంచ్ నన్నం వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ తల్లపనేని భుజంగరావు పలు కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరిని అరవిందబాబు, కోటేశ్వరరావులు సాదరంగా ఆహ్వానించారు. వీరి చేరికతో గ్రామంలో పార్టీ మరింత బలోపేతమైందని అరవిందబాబు తెలిపారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ గాలి వీస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో టీడీపీ అత్యధిక మెజార్టీతో గెలవబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సీఐ సాంబశివరావు, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రజాక్ తదితరులు

రక్తదాతలకు సీఐ అభినందనలు

వినుకొండ టౌన్, మార్చి 28: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో అఖిల్‌కలాం థెరిస్సా సేవా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మనిచ్చిన అమ్మకోసం పేరుతో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని స్థానిక సీఐ సాంబశివరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసవించే నిరుపేద మాతృమూర్తుల కోసం తలపెట్టిన ఈ కార్యక్రమం చాలామంది తల్లులకు ఉపయోగపడుతుందని, సేవా సంస్థ చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. సీఐ పిలుపు మేరకు కాలేజి విద్యార్థులు, డ్రైవర్లు, వ్యాపారులు, ఉద్యోగులు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన వారందరికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో చందోలు నాగవాణి, వైద్యశాల సూపరింటెండెంట్ అబ్దుల్ రజాక్, డాక్టర్ మన్నవ రవి, ఎంఎస్ బాబు, వెంకటరావు, డి.రాజు, అభిషేక్ ప్రిన్స్, సుబ్బు, సుధాకర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు

● మునిసిపల్ కమిషనర్ రవిచంద్రరెడ్డి

నరసరావుపేట రూరల్, మార్చి 28: నరసరావుపేట పురపాలక సంఘానికి చెల్లించవలసిన ఆస్తి పన్నులు, ఇతర పన్నులు వడ్డీ లేకుండా మార్చి 31, 2024లోపు చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు మునిసిపల్ కమిషనర్ సి రవిచంద్రరెడ్డి తెలిపారు. వడ్డీ లేకుండా చెల్లించేందుకు మూడు రోజుల వ్యవధి మాత్రమే ఉందన్నారు. నేడు గుడ్ ఫ్రైడే, శనివారం, ఆదివారం శెలవు దినాలలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణ ప్రజలందరూ చెల్లించవలసిన ఆస్తి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, వాటర్ చార్జీలు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి దోహదపడాలని మునిసిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు.

బాలల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

● బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

నరసరావుపేట రూరల్, మార్చి 28: మండలంలోని ములకలూరు జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థిని కొట్టిన సంఘటనపై స్పందించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి తక్షణమే విచారణ జరిపి నివేదిక సమర్పించాలని విద్యాశాఖ అధికారికి, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌కు రెండు రోజుల క్రితం ఆదేశాలు జారీచేశారు. వారు తమ నివేదికను కమిషన్ కు సమర్పించినట్లు తెలిపారు. సంబంధిత శాఖల వారి నివేదికల ఆధారంగా విద్యార్థినిని కొట్టిన ఉపాధ్యాయురాలి పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, తక్షణమే షోకాజ్ నోటీస్ జారీ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశాలు జారీ చేశామని పద్మావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలల హక్కుల కు విఘాతం కలిగించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు.

అభివృద్ధి కోసం వైసీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలి

● ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల, మార్చి 28: రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సంతగుడిపాడులో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి అనీల్‌కుమార్ యాదవ్‌తో కలసి బుధవారం రాత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఓటువేస్తే అభివృద్ధిని, సంక్షేమ పథకాలను వదులుకున్నట్లేనని తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వానికి ఎనలేని ఆదరణ వస్తుందని తెలిపారు.

● శావల్యాపురం: ఐదేళ్ళ వైసీపీ పాలనలో రాష్ట్రంలో జరిగిన సంక్షేమాన్ని, అభివృద్ధిని చూసి మరోసారి వైసీపీ అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించాలని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. మండలంలోని కారుమంచి, మతుకుమల్లి, బొందిలిపాలెం, శానంపూడి, ముండ్రువారిపాలెం గ్రామాలలో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో జరగనంతగా సంక్షేమ పథకాల ద్వారా రూ.2.75లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లోకి జమచేసిన ఏకైక సీఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ మాటలకే పరిమితమైన ప్రతిపక్షాలను నమ్మకుండా ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన సీఎం జగన్‌ను మరోసారి గెలిపించేందుకు తనను, అనిల్‌కుమార్‌ను ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు.

కంటైనర్‌ను ఢీకొన్న కారు

● తీవ్రంగా గాయపడిన ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రి పీజీ విద్యార్థి

యడ్లపాడు, మార్చి 28: పదహారో నంబరు జాతీయ రహదారిపై యడ్లపాడు మండలం తిమ్మాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం పట్టణానికి చెందిన 26ఏళ్ళ డాక్టర్ మద్దినేని పవన్‌కృష్ణ మంగళగిరి ఎన్‌ఆర్‌ఐ వైద్య కళాశాలలో పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కారులో తిరుపతికి వెళ్ళిన పవన్‌కృష్ణ గురువారం తిరుగు ప్రయాణమయ్యాడు. తిమ్మాపురం వద్దకు రాగానే కారు అదుపుతప్పి ముందు వెళుతున్న కంటైనర్ లారీని వెనుకనుంచి వేగంగా ఢీకొట్టింది. దీనితో కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా పవన్‌కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108సిబ్బంది అంబులెన్స్‌లో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు మంగళగిరి ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గురైన వాహనాన్ని క్రేన్‌సాయంతో తొలగించి ట్రాఫిక్‌ను సరిచేశారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థికసాయం అందజేత

యడ్లపాడు, మార్చి 28: ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న టీడీపీ కార్యకర్తకు ప్రత్తిపాటి చేయూతనందించారు. యడ్లపాడు మండలం జగ్గాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త దావల అశోక్ ఈ నెల బొప్పూడి వద్ద జరిగిన ప్రజాగళం సభకు హాజరయ్యాడు. సభ ముగిసిన అనంతరం గ్రామానికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అశోక్‌ను స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స చేయించి అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం నరసరావుపేటలోని ఓ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అశోక్‌కు మెరుగైన వైద్యం అందించాలని, వైద్య ఖర్చులు తాను భరిస్తానని హామీ ఇచ్చారు. వైద్యానికి అయిన ఖర్చులతోపాటు రోజువారీ ఖర్చుల నిమిత్తం మరో రూ.10వేలు ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. గురువారం గ్రామపార్టీ అధ్యక్షుడు పోపూరి శ్రీనివాసరావు ద్వారా ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న అశోక్ భార్య శ్రావణికి ప్రకటించిన ఆర్థికసాయాన్ని ప్రత్తిపాటి అందజేశారు.

అభివృద్ధి గురించి పట్టించుకోని వ్యక్తి గోపిరెడ్డి

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల

రొంపిచర్ల, మార్చి 28: నరసరావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి గురించి పట్టించుకోని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు విమర్శించారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో గురువారం ఆయన మాట్లాడుతూ నరసరావుపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించటం ఖాయమన్నారు. గోపిరెడ్డికి మూడోసారి ఓటువేస్తే నరసరావుపేట నియోజకవర్గాన్ని వ్యాపార సంస్థగా మారుస్తాడని తెలిపారు. నిరుద్యోగ సమస్య రైతుల సమస్యలను తీర్చలేదన్నారు. రైతులు సాగునీరు లేక ఇబ్బందులు పడుతుంటే వారి సమస్యలను ఏనాడైనా పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అమరావతి రాజధాని అని చెప్పిన ఎమ్మెల్యే ప్రస్తుతం మూడు రాజధానులకు మద్దతుగా మాట్లాడుతున్నారన్నారు. ఉద్యోగాలు లేక యువత రాష్ట్రం విడిచి పెట్టి వెళ్ళిపోతున్నారన్నారు. నాగార్జున సాగర్‌లో నీరులేక పోవటం వల్ల ఆయకట్టు రైతులు వరి పంట సాగు చేయటం లేదన్నారు. గతంలో తెలంగాణలో ఇటువంటి పరిస్థితి ఉండేదన్నారు. ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే గ్రూపులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో వైసీపీపై వ్యతిరేకత ఉందన్నారు. కార్యక్రమంలో వడ్లమూడి కిషోర్, నెల్లూరి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో సరుగుడు తోట దగ్ధం

నాదెండ్ల, మార్చి 28: మండలంలోని సాతులూరు గ్రామ పరిధిలో జరిగిన అగ్ని ప్రమాదంలో సరుగుడు తోట దగ్ధమైంది. ఆస్తినష్టం సుమారు రెండు లక్షల వరకు ఉంటుందని అంచనా. నరసరావుపేట అగ్నిమాపకశాఖ అధికారి ఎంవీ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వజ్జా కృష్ణకు చెందిన సరుగుడు తోటలో మద్యం సేవించి సిగరెట్ కాల్చిపడవేశారు. దీంతో గాలికి మంటలు వ్యాపించి సరుగుడు తోట పూర్తిగా దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది సాంబశివరావు, శ్రీనివాసరావు, సతీష్, శేఖర్‌లు పక్క తోటలకు మంటలు వ్యాపించకుండా గ్రామస్థుల సాయంతో మంటలను అదుపుచేశారు.

కోదండ రామస్వామి దేవాలయానికి భూమి పూజ

నాదెండ్ల, మార్చి 28: మండలంలోని సాతులూరు గ్రామంలోని వడ్డెరపాలెం సెంటర్‌లో వడియరాజుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న కోదండ రామస్వామి దేవాలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల మధ్య పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో కార్యక్రమం నిర్వహించారు. సుమారు కోటి రూపాయల వ్యయంతో ఈ దేవాలయాన్ని నిర్మించనున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చెందిన జెట్టిపాటి సురేష్, కుంచాల చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన డీఎస్పీ వర్మ



కొచ్చెర్లలో 97,98 బూత్‌లను పరిశీలిస్తున్న డీఎస్పీ వర్మ

ఈపూరు, మార్చి 28: మండలంలోని పోలింగ్ బూత్‌లను నర్సరావుపేట డీఎస్పీ ఏఎస్ఎన్ వర్మ గురువారం పరిశీలించారు. కొండ్రముట్ల, కొచ్చెర్ల, అంగలూరు, వనికుంట, ఈపూరు, బొమ్మరాజుపల్లి, ఇనుమెళ్ళ గ్రామాలలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా ఏర్పాట్లును పరిశీలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమస్యాత్మక గ్రామాలలో గ్రామాలలో రౌడీ షీటర్లపై దృష్టి సారించాలన్నారు. డీఎస్పీతో పాటు వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్‌బాబు, ఎస్ఐ మహమ్మద్ ఫిరోజ్‌లు ఉన్నారు.

ఎన్నికల్లో పోటీకి సీపీఐ సంసిద్ధం: మారుతీవరప్రసాదు

చిలకలూరిపేట, మార్చి 28: రానున్న ఎన్నికల్లో చిలకలూరిపేట అసెంబ్లీ నియోజక వర్గం నుంచి సీపీఐ తిరుపున పోటీ చేయటానికి సంసిద్ధమవుతున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాదు గురువారం అన్నారు. ఈ విషయమై చర్చించటం కోసం స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ ఏరియా కమిటీ సమావేశాన్ని నాగభైరు రామ సుబ్బాయమ్మ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పేలూరి రామారావు, తాళ్ళూరి బాబూరావు, దాసరి వరహాలు, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.